RNI No : APTEL 2020/80757

www.sreeprasthanam.in

శ్రీ ప్రస్థానం
మన దేశం..మన హక్కు
తెలుగు దినపత్రిక

## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రధాన్యత ఉంటుంది.

**పెరుమాళ్ళ వర ప్రసాద్**

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386 85220 22029

Land Line No : 08517 224194

కర్నూలు సంపుటి : 04 సంచిక : 81 బుధవారం 24-07-2024 పేజీలు :04 వెల:రూ.2.00

# ఎపికి బడ్జెట్‌లో వరాల జల్లు

**అమరావతి నిర్మాణానికి 15వేల కోట్లు**

**పోలవరం పూర్తికి బడ్జెట్‌లో హామీ**

న్యూఢిల్లీ,జూలై23 : కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఏపీకి వరాల జల్లు కురిపించారు. రాష్ట్రానికి ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. రాజధాని అమరావతికి భారీ ఆర్థిక సాయం ప్రకటించారు. అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లు కేటాయించినట్లు చెప్పారు. అవసరాన్ని బట్టి భవిష్యత్తులో మరిన్ని అదనపు నిధులు ఇస్తామని స్పష్టం చేశారు. అలాగే, పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి పూర్తిగా సాయం చేస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, రైతులకు పోలవరం జీవనాడి అని.. భారత ఆహార భద్రతకు పోలవరం ఎంతో కీలకమైనదని చెప్పారు. అలాగే, హైదరాబాద్ – బెంగుళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి కూడా ప్రత్యేక నిధులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలకు నీళ్లు, విద్యుత్, రోడ్లు, హైవేల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని స్పష్టం చేశారు.

# 9 ప్రాధాన్య అంశాల ఆధారంగా బడ్జెట్

కొన్ని ఆశలు..మరికొన్ని ఆకాంక్షలు
వ్యవసాయరంగానికి పెద్దపీట వేస్తూ నిర్ణయం
నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనపై దృష్టి
స్థూలంగా బడ్జెట్ పరిమాణం రూ.48.21 కోట్లు
మొత్తం ఆదాయం రూ.32.07 లక్షల కోట్లు
పన్ను ఆదాయంఅంచనా రూ.28.83 లక్షల కోట్లు
ద్రవ్యలోటు 4.9 శాతంగా ఉండవచ్చని అంచనా
అప్పులు, పన్నేతర ఆదాయాలు రూ.16 లక్షల కోట్లు
అమరావతి నిర్మాణానికి 15వేల కోట్లు కేటాయింపు
పోలవరం పూర్తిచేసేందుకు వాగ్దానం
బీహార్‌లో మౌళిక వసతుల కల్పనలకు భారీగా కేటాయింపులు
బంగారం, ఫోన్స్ యాక్సరీస్‌పై సుంకాలు తగ్గింపు




న్యూఢిల్లీ,జూలై23: కొన్ని మెరుపులు..మరికొన్ని విరుపులు.. కొన్ని ఆశలు..మరికొన్ని ఆకాంక్షలతో ఎప్పటిలాగే ఉద్యోగుల ఇన్‌కమ్ ట్యాక్స్‌పై పెద్దగా సడలింపులు లేకుండా కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రతిపాదనలను ప్రవేశ పెట్టారు. కేంద్ర ప్రభుత్వం 9 ప్రాధాన్య అంశాల ఆధారంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఆర్థిక వ్యవస్థలో అవకాశాలను సృష్టించడమే లక్ష్యంగా ప్రాధాన్య అంశాలను ఎంపిక చేసుకుంది. వ్యవసాయ రంగంలో ఉత్పాదకత, ఉద్యోగ కల్పన- నైపుణ్యాభివృద్ధి, సామాజిక న్యాయం, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక రంగం, పరిశోధన- ఆవిష్కరణలు, తయారీ–సేవలు, తర్వాత తరం సంస్కరణలు- ఈ తొమ్మిది అంశాలను ప్రాధాన్యంగా తీసుకున్నట్లు కేంద్రం ప్రకటించింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఏడోసారి బడ్జెట్ ప్రవేశపెడుతూ.. ఈ అంశాలను ప్రకటించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం లోక్ సభలో ప్రవేశ పెట్టారు. తొమ్మిది సూత్రాల ఆధారంగా బడ్జెట్‌రూపకల్పన చేసినట్లు చెప్పారు. వ్యవసాయ రంగంలో ఉత్పాదకత, ఉద్యోగ కల్పన, నైపుణ్యాభివృద్ధి, సామాజిక న్యాయం, పట్టణాభివృద్ధి, ఇంధన భద్రత, మౌలిక రంగం, పరిశోధన, ఆవిష్కరణలు, తయారీ,సేవలు, తర్వాతతరం సంస్కరణలు.. ఈ తొమ్మిది సూత్రాల ప్రాధాన్యంగా తీసుకుని బడ్జెట్ రూపొందించినట్లు తన ప్రసంగంలో విత్త మంత్రి ప్రకటించారు. ఇక ఈ బడ్జెట్ మొత్తంలో వివిధ రంగాలన్నింటికి కలిపి రూ.48.21 లక్షల కోట్ల కేటాయింపులు చేశారు. అంటే స్థూలంగా బడ్జెట్ పరిమాణం రూ.48.21 కోట్లు. ఇందులో మొత్తం ఆదాయాన్ని రూ.32.07 లక్షల కోట్లుగా, దానిలో పన్ను ఆదాయాన్ని రూ.28.83 లక్షల కోట్లుగా చూపించారు. ఈ ఏడాది ద్రవ్యలోటు 4.9 శాతంగా ఉండవచ్చని అంచనా వేశారు. అప్పులు, పన్నేతర ఆదాయాలు రూ.16 లక్షల కోట్లుగా అంచనా కట్టారు. అదేవిధంగా నూతన పింఛన్ విధానంలో త్వరలో మార్పులు చేయనున్నట్లు తెలిపారు. బడ్జెట్‌లో రైతులు,యువతపై ఎక్కువ దృష్టి పెట్టారు. యూత్ కు 2 లక్షల కోట్లు కేటాయించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రకటించారు. మొబైల్స్, బంగారంపై కస్టమ్స్ డ్యూటీని తగ్గించారు. ఆదాయపు పన్ను శ్లాబులను సవరించారు. అయితే ఉద్యోగస్థులకు పెద్దగా ఉరట కల్పించలేక పోయారు. టాప్ 500 కంపెనీలలో కోటి మంది యువతకు 12 నెలల ఇంటర్న్ షిప్ అవకాశాలు కల్పించేనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్న్ షిప్ భత్యంగా నెలకు రూ.5000, వన్ టైమ్ అసిస్టెన్స్ కింద రూ. 6000 ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇక కంపెనీలు ఇంటర్న్ షిప్ వ్యయంలో 12 శాతం భరించాల్సి ఉంటుంది. బీహార్, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై కూడా దృష్టి సారిస్తామని నిర్మలా సీతారామన్ అన్నారు. బీహార్ లో విమానాశ్రయాలు, మెడికల్ కాలేజ్ లు, క్రీడల మౌలిక వసతులు ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బీహార్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఆందప్రదేశ్ రాష్ట్రాలను అభివృద్ధి పరుస్తామన్నారు. కాగా ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధికి రూ. 15000 కోట్లను కేటాయించారు. మొబైల్ ఫోన్లపై, యాక్ససెరీలపై, ఛార్జర్స్ పై 15 శాతం తగ్గింపు ఉంటుందన్నారు. ఉన్నత విద్య, దేశీయ సంస్థలకు రూ. 10 లక్ష ల కోట్లు కేటాయించారు. ఇకపోతే స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) లోటు 4.9 శాతం ఉ ఒడగలదన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో 4.5 శాతం ఆర్థిక లోటుకే చేరుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. వచ్చే రెండేళ్లలో కోటిమంది రైతులను ప్రకృతి వ్యవసాయం దిశగా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. కూరగాయల ఉత్పత్తి పెద్దఎత్తున చేపట్టేలా క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయం, అనుబంధ రంగాలకు భారీగా కేటాయింపులు చేశారు. ముఖ్యంగా సేంద్రీయ వ్యవసాయంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు రూ. 1.52 లక్షల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. వచ్చే రెండేళ్లలో కోటి మంది రైతులు సేంద్రీయ వ్యవసాయంలోకి ప్రవేశించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వ్యవసాయంలో స్థిరమైన పద్ధతులు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఉత్పత్తి పెంపుదలపై దృష్టి సారించామని.. ఆ దిశగా కార్యక్రమాలు చేపడతున్నామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారమన్ తెలిపారు.అంతేకాదు.. వాతావరణ పరిస్థితులను తట్టుకునే, అధిక దిగుబడినిచ్చే ఉద్యానవన పంటలకు సంబంధించి 109 కొత్త వంగడాలను ప్రభుత్వం విడుదల చేయనున్నట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. వ్యసాయ రంగానికి కేటాయించిన రూ. రాష్ట్రాల భాగస్వామ్యంతో ప్రభుత్వం వ్యవసాయానికి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్టక్చర్‌ను ప్రోత్సహిస్తుందని ప్రకటించారు. ఇక గ్రామీణాభివృద్ధి కోసం రూ. 2.66 లక్షల కోట్లు కేటాయిస్తున్నట్లు నిర్మలా సీతారామన్ ప్రకటించారు. వ్యవసాయ ఉత్పాదతకు పెంపొందించడానికి, వాతావరణాన్ని తట్టుకోగల రకాలను అభివృద్ధి చేయడానికి వ్యవసాయ పరిశోధన శాలను ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం సమగ్ర సమీక్ష చేస్తుందన్నారు.

# ఆర్థిక ఇబ్బందులతో ఎపి సతమతం

బడ్జెట్ ప్రవేశ పెట్టలేని దుస్థితిలో రాష్ట్రం
పదేళ్లుగా రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్
అప్పులతో కుదేలైన రాష్ట్ర ప్రగతి
వికసిత్ భారత్ వైపు దేశం అడుగులు
అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంలో సిఎం



అమరావతి,జూలై23: ఆర్థిక ఇబ్బందులతో బడ్జెట్ పెట్టుకోలేని పరిస్థితి ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రెండు నెలలు సమయం తీసుకుని బడ్జెట్ పెట్టాలనుకున్నామని అన్నారు. వికసిత్ భారత్ 2047తో ప్రపంచంలోనే తొలి రెండు స్థానాల్లో ఇండియా నిలుస్తుందని తెలిపారు. వికసిత్ భారత్ వైపు దేశం అడుగులు వేస్తోందని తెలిపారు. విజన్ 2020 తయారుచేశాక అభివృద్ధి మొదలైందని అన్నారు. గత ఎన్నికల్లో కూటమిని అద్భుత మెజార్టీతో ప్రజలు గెలిపించారని చెప్పారు. ఎన్నికల ఫలితాలు ప్రజా చైతన్యానికి నిదర్శనమన్నారు. 93 శాతం స్ట్రైక్ రేట్‌తో కూటమికి 57 శాతం ఓట్లు పడ్డాయని తెలిపారు. తన రాజకీయ జీవితంలో ఇలాంటి ఫలితం ఎప్పుడూ చూడలేదని చెప్పారు. ఏపీ అసెంబ్లీలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగానికి చంద్రబాబు ధన్యవాద తీర్మానం చేశారు. పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగంతోనే ఏపీ ఏర్పాటు చేశారని అన్నారు. ఐదేళ్లూ మూడు రాజధానుల పేరుతో వైసీపీ నెట్టుకొచ్చిందని విమర్శించారు. మాజీ సీఎం జగన్ రాజధాని లేకుండా చేశారని మండిపడ్డారు. రాష్ట్రం ఏర్పడి పదేళ్లయినా రాజధాని లేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు జాతి అంటే గతంలో మద్రాస్ అనేవారని, తెలుగు జాతి గౌరవాన్ని దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు పెంచారని కొనియాడారు. తెలుగు వారంటే ఆంధ్రప్రదేశ్ అనేలా ఎన్టీఆర్ చేశారని గుర్తుచేశారు. నాడు ఐటీకి ఎంతో ప్రాధాన్యత ఇచ్చామని వివరించారు. మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు ఆర్థిక సవరణలతో దేశంలో పెనుమార్పులు వచ్చాయని కొనియాడారు. భాగస్వామ్యంతో దేశంలో బ్రహ్మాండమైన అభివృద్ధి పనులు చేశారన్నారు. కూటమి విజయం వెనుక అందరి కృషి ఉంది. గత ఐదేళ్లు చాలా ఇబ్బందులు పడ్డాం. జైలుకు వచ్చి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నన్ను పరామర్శించారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదనే పవన్ ముందుకొచ్చారు. ఇద్దరం కలిసిన తర్వాత బీజేపీ మాతో చేతులు కలిపింది. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఉమ్మడిగా పోటీచేశాం. మళ్లీ మంచిరోజులు ప్రారంభ మయ్యాయని ప్రజలు భావించారు. మూడు పార్టీలు కలిశాక ఎవరూ ఊహించని ఫలితాలు వచ్చాయి. ఏపీని మళ్లీ అభివృద్ధి చేసేవరకు కలిసిపనిచేస్తాం. రాష్ట్ర చరిత్రలో గత ఐదేళ్లు చీకటి రోజులు. ఎక్కడా భూములు, ఆస్తులను వదల్లేదు. మెడపై కత్తిపెట్టి తమ పేరుపై భూములు రాయించుకున్నారు. దౌర్జన్యాలు, విధ్వంసాలు, కబ్జాలు, దాడులు, కేసులు ఎన్నో చూశాం. జగన్ పాలనలో వ్యవస్థలన్నీ విధ్వంసం. అహంకారంతో జగన్ విర్రవీగారు. అసమర్థతతో వ్యవస్థలను జగన్ నాశనం చేశారు. మంచి రాష్ట్రాన్నిజగన్ సర్వనాశనం చేశారు‘ అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్ర విభజన జరిగి 10 ఏళ్లు అయిందని.. నేటికి రాజధాని రాష్ట్రంగా ఆంధప్రదేశ్ ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తెలుగు ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. ఐదేళ్లు మూడు రాజధానులంటూ గత వైసీపీ ప్రభుత్వం నెట్టుకొచ్చిందన్నారు. వికసిత భారత్ వైపు భారత్ అడుగులు వేస్తుందన్నారు. 2047 నాటికి భారతదేశం ప్రపంచంలోనే తొలి స్థానం లేదా రెండో స్థానంలో ఉంటుందని చంద్రబాబు పేర్కొన్నారు.

# కేంద్రబడ్జెట్‌లో ఎపికి ఆదరణ


**ప్రధాని మోడీ,నిర్మలకు బాబు కృతజ్ఞతలు**

అమరావతి,జూలై23 : కేంద్ర బడ్జెట్ లో రాష్ట్రానికి నిధులు కేటాయించినందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఏపీ ప్రజల తరపున సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అవసరాలను గుర్తించి రాజధాని, పోలవరం, పారిశ్రామిక రంగాలపై దృష్టి సారించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం నుంచి వచ్చే సహకారం ఏపీ పునర్నిర్మాణానికి చాలా ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రానికి విశ్వాసాన్ని పెంచే బడ్జెట్ ను సమర్పించినందుకు కేంద్రాన్ని అభినందించారు. ఏపీ మళ్లీ గాడిలో పడుతోందని చంద్రబాబు పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత గత ఐదేళ్ల వైకాపా పాలనలో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ ను గట్టెక్కించేలా బడ్జెట్ లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శుభవార్త చెప్పారు. కేంద్ర బడ్జెట్ లో ఏపీకి ప్రత్యేక ఆర్థిక సాయం ప్రకటించారు. రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అవసరాన్ని బట్టి భవిష్యత్తులో మరిన్ని అదనపు నిధులు కేటాయిస్తామని చెప్పారు. ‘ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, రైతులకు జీవనాడి పోలవరం. భారత ఆహార భద్రతకు ఆ ప్రాజెక్టు ఎంతో కీలకమైనది. పోలవరం నిర్మాణం సత్వరం జరిగేలా చూస్తాం‘ అని నిర్మలమ్మ భరోసానిచ్చారు. ఏపీలో వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వనున్నట్లు నిర్మలమ్మ ప్రకటించారు. రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు మంజూరు చేస్తామన్నారు. విభజన చట్టం ప్రకారం పారిశ్రామికాభివృద్ధికి ప్రత్యేక సహకారం అందిస్తామని కేంద్రమంత్రి వెల్లడించారు. హైదరాబాద్–బెంగళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు అందిస్తామన్నారు. విశాఖ–చెన్నై పారిశ్రామిక కారిడార్‌లోని నోడ్‌లకు ప్రత్యేక సాయం చేస్తామన్నారు. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలకు నీళ్లు, విద్యుత్, రోడ్లు, హైవేల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామన్నారు. విశాఖ – చెన్నై కారిడార్‌లో కొప్పర్తికి, హైదరాబాద్–బెంగళూరు కారిడార్‌లో ఓర్వకల్లుకు నిధులు ఇస్తామని కేంద్ర మంత్రి తెలిపారు.



# 2024 బడ్జెట్‌ను ప్రశంసించిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోడీ, నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన యూనియన్ బడ్జెట్–2024ను ప్రశంసించారు. ‘ఈ బడ్జెట్ సమాజం లోని ప్రతి వర్గాన్ని బలోపేతం చేస్తుంది. ఈ బడ్జెట్ దేశంలోని పేదలు, గ్రామాలు, రైతులను సౌభాగ్యం దిశలో నడిపించనున్నది" అని ఆయన వీడియో సందేశం ద్వారా తెలిపారు."గత 10 ఏళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారుఈ బడ్జెట్ కొత్త మధ్యత రగతి సాధికారత కోసం. ఈ బడ్జెట్ ద్వారా యువతకు అపరిమిత అవకా శాలు లభిస్తాయి. ఈ బడ్జెట్ నుండి విద్య , నైపుణ్యం కొత్త స్థాయిని పొందు తాయి. ఈ బడ్జెట్ కొత్త మధ్యతం గతికి శక్తిని ఇస్తుంది.. ఈ బడ్జెట్ మహిళలు, చిన్న వ్యాపారులు, ఓూఓఇ లకు సహాయం చేస్తుంది, "అని మోడీ అన్నారు.విద్య , నైపుణ్యానికి బడ్జెట్ కొత్త పీఠం వేస్తుందని ప్రధాని అన్నారు. "ఇది మధ్యతరగతి ప్రజలకు కొత్త బలాన్ని ఇస్తుంది. గిరిజనులు, దళితులు , వెనుకబడిన వారిని బలోపేతం చేసే లక్ష్యంతో ఇది బలమైన పథకాలతో వచ్చింది. ఆర్థిక భాగస్వామ్యానికి భరోసా కల్పించేందుకు ఈ బడ్జెట్ తోడ్పడుతుంది" అని ప్రధాని మోడీ అన్నారు.



# శిశుపాలుడు ఎవరో ఎవరి పాపం పండిందో ఎన్నికల్లో ప్రజలే చెప్పారు కదా జగన్

**మంత్రి నారా లోకేశ్**



అమరావతి, 50 రోజుల పాలనలో అన్నింటా విఫలమైన కూటమి ప్రభుత్వం భయపడుతోందని, ప్రభుత్వం వేసే ప్రతి అడుగులో భయం కనిపిస్తోందని. చంద్రబాబు ఎంతగా భయపడుతున్నాడంటే బడ్జెట్ కూడా ప్రవేశపెట్టలేకపోతున్నాడని జగన్ చేసిన వ్యాఖ్యలపై టీడీపీ నేతలు మండిపడుతున్నారు.తాజాగా, మంత్రి నారా లోకేశ్ కూడా జగన్ పై విరుచుకుపడ్డారు. పులివెందుల ఎమ్మెల్యే జగన్ ఇంకా తత్వం బోధపడినట్టు లేదని ఎద్దేవా చేశారు.ఈ 50 రోజుల ప్రభుత్వంలో మేం భయంతో ఉండడం కాదు. ప్రజల పట్ల, రాష్ట్రం పట్ల బాధ్యతతో ఉన్నాం. మీరే ఇంకా భ్రమల్లో ఉన్నారు. అధికారం దూరమైందన్న బాధ, అక్రమార్జన ఆగిపోయిందన్న ఆవేదన, ఉనికిని చాటుకోలేకపోతున్నామనే మీ నిస్పృహ, ఫేక్ రాజకీయం పండడం లేదనే ఫ్రస్టేషన్, ప్రజల్లో ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే ఉక్రోషం. మీ మాటల్లో, మీ చేష్టల్లో, మీ కుట్రల్లో అడుగడుగునా కనిపిస్తున్నాయి.జగన్ మీరు ఓ విషయం గుర్తించాలి. ప్రతిపక్ష హోదా కూడా రాని స్థాయిని మీకు కట్టబెట్టింది ప్రజలు. దానికి కారణాలు ఇప్పటికైనా తెలుసుకోండి, వాస్తవాలు అంగీకరించండి. జగన్ ఇంకా ఇలాగే వ్యవహరిస్తుంటే, తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్న చందంగా ఉంటే. మొన్న ఎన్నికల్లో 151లో 5 మాయం అయ్యింది, ఇప్పుడు 11లో ఒకటి మాయం అవుతుంది.శిశుపాలుడు ఎవరో, ఎవరి పాపం పండిందో మొన్న ప్రజలే తేల్చిచెప్పారు. ఐదేళ్ల పాటు మీరు సాగించిన విధ్వంసాన్ని 50 రోజుల్లోనే మా కూటమి ప్రభుత్వం తుడిచివేయలేదంటూ మీరు చేసే విషప్రచారం ప్రజామోదం పొందదు. ఇక భయం గురించి అంటారా. ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించిన మాకెందుకు భయం? ఎవరిని చూసి భయం? మీ తీరు చూస్తుంటే మొన్నటి ఓటమి భయం మిమ్మల్ని తీవ్రంగా వెంటాడుతున్నట్టు స్పష్టంగా కనిపిస్తోంది, అని నారా లోకేశ్ తన ట్వీట్ లో పేర్కొన్నారు.

# సంపాదకీయం

బుధవారం 24-07-2024

## నియంతల పాలనకు లోక్‌పాల్‌తోనే చెక్ !

తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు విపక్షంలో ఉన్న బిఆర్ఎస్, వైకాపాల తీరు ఒక్కటిగానే ఉంది. ప్రభుత్వంలో ఉండగా అలానే ఉండేది. ఇద్దరి మనస్థత్వాలు ఒక్కటే అన్నది మెల్లగా ఇప్పుడు జనాలకు అర్థం అవుతోంది. అధికారంలో ఉండగా అడ్డూ అదుపు లేకుండా వ్యవహరించారు. చరిత్రలో నియంతలను చూడకున్నా.. ఎలా ఉంటారో ఈ ఇద్దరినీ చూసిన వారికి అర్థం అయివుంటుంది. తెలంగాణ సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని నయా నియంతలా వ్యవహరించిన కెసిఆర్ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేసి, వ్యవస్థలను భ్రష్టు పట్టించి.. ఇప్పుడు ఎదురుదాడి విమర్శల్లో తప్పులను కప్పి పుచ్చుకునే తంటాలు పడుతున్నారు. అందుకే అధికార రుచి మరిగిన ఈ ఇద్దరూ ..మరోమారు అధికారంలో ఉండేలా పథకాల రచన చేసి రాష్ట్రాలను దోచేశారు. ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేసి రాష్ట్రాలను దివాళా తీయించారు. పథకాల పేరుతో నగదును దోచి పెట్టారు. చేతికి ఎముక లేదన్నట్లుగా పథకాల రూపకల్పనతో నగదు బదిలీలు చేశారు. అభివృద్ధి పేరుతో అప్పులు చేసి సంపద సృష్టించామని గొప్పలు చెప్పారు. ప్యాలెస్‌లు కట్టుకున్నారు. పేదవాడికి ఓ డబుల్ ఇల్లుకు నానా తంటాలు పడ్డా, తమకు మాత్రం రాజప్రసాదాలు కావాలని భావించారు. ఇంతగా డబ్బును వినియోగించి, ప్రజల చెమటను విలాసాలకు ఉపయోగించేశారు. కరిమింగిన వెలగపండులా ఇప్పుడు పరిస్థితి అంతా డొల్లగా మారింది. ఇద్దరూ అధికారం కోల్పోయారు. కొంత వ్యవధి తేడాల ఇద్దరూ విపక్షం లోకి వచ్చారు. ఇప్పుడు కూడా ఈ ఇద్దరి మనస్తత్వం, కార్యక్రమాలు ఒకేరీతిన ఉన్నాయి. మొగుడిని కొట్టి మొగసాలకు ఎక్కిందన్న సామెతలా..చేసిన తప్పులన్నీ చేసినానాయాగీ చేస్తున్నారు. ఎపిలో జగన్ అక్కడంతా అక్రమాలు, అహింస రాజ్యమేలుతున్నాయని గగ్గోలు పెడుతున్నారు. 40 రోజుల్లోనే ఏదో జరిగినట్లు నల్లగుడ్డలు కప్పుకుని మొక్కుబడిగా అసెంబ్లీకి రావడం,పోలీస్ అధికారులపై జులుం ప్రదర్శించ డం కూడా జరిగిపోయాయి. తనకు విపక్ష హోదా ఇవ్వడానికి భయపడుతున్నారని కూడా ఓ రాయి విసిరారు. అధికారంలో ఉన్నా, లేకున్నా హుందాతనం ప్రదర్శించడంలో అటు కెసిఆర్, ఇటు జగన్ ఇద్దరూ విఫలం అయ్యారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో అధికార మార్పిడి జరిగిన తర్వాత అప్పట్లో పరిస్థితులు ఎలా ఉండేవో ఇప్పుడు ఎలా ఉన్నాయో ప్రజలకు అర్థం అవుతోంది. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఇంతగా ఎందుకు దిగజారిపోయారా అని అనుమానం కలుగుతోంది. ఎపిలో జగన్ అధికారంలో ఉండగా ఒక రకమైన భయానక వాతావరణం ఉండింది. బయటకు విమర్శలు చేస్తే....యూ ట్యూబర్లపైనా కేసులు పెట్టి వేధించిన ఘటనలు చూశాం. ప్రజలంతా భయం గుప్పిట్లో బతికారు. జగన్‌తో పాటు ఆయన కోటరీలో ఉన్న వారి వల్ల అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూసింది. తెలంగాణలో కూడా అధికార వ్యవస్థ భ్రష్టుపట్టి పోయింది. ఫోన్ ట్యాపింగ్‌తో ప్రత్యర్థుల ఫోన్లను ట్యాప్ చేశారు. అధికార దుర్వినియోగం విపరీతంగా సాగింది. ప్రగతి భవన్ పేరిట ప్యాలెస్‌ను పోలిన భవనాన్ని నిర్మింపజేసి అందులో నుంచి కాలు బయటపెట్టకుండా కనుసైగలతో రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు. అయినా ఆయనతో పాటు కొడుకు, అల్లుడి తీరులో మార్పు కనిపించడం లేదు. పాశ్చాత్తాపం కానరావడం లేదు. బటన్లు నొక్కడం వల్ల మళ్లీ అధికారంలోకి వస్తామని జగన్ నమ్మి అడ్డగోలు పనులు చేశారు. అందుకే జగన్‌ను జనం కసిగా ఓడించినా.. కారణాలు తెలుసుకోలేక పోతున్నారు. ఆత్మ విమర్శల చేసుకోవడం లేదు. రోడ్డెక్కి నానా హంగామా చేయాలని చూస్తున్నారు. అందుకే ప్రజలతో పాటు, అణచివేతకు గురైన నేతలు తమకు ఎదురైన అనుభవాలను గుర్తుచేసుకుంటూ పగ తీర్చుకోవాలని రగిలిపోతున్నారు. ఇప్పుడు ఘోర పరాజయం పాలయ్యాక కూడా గుణపాఠం నేర్చుకోకుండా నోటికి పని చెబుతున్నారు. ఈ క్రమంలోనే అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న వేళ ఢిల్లీలో ధర్నాకు దిగడానికి వెళ్లారు. పల్నాడులో జరిగిన ఓ వ్యక్తిగత హత్యను తనకు అనుకూలంగా మార్చుకోవాలని చేస్తున్న ప్రయత్నంతో ప్రజల్లో భంగపడ్డారు. ఈ హత్యపై గగ్గోలు పెడుతున్న జగన్ సొంత చిన్నాన్న హత్యను పట్టించుకోవడం లేదు. విచారణకు అడుగడు గునా అడ్డు పడ్డారు. వివేకానంద రెడ్డిని హత్య చేయించిన వారిని ముఖ్యమంత్రిగా జగన్ రక్షించారని ప్రజలు నమ్ముతున్నారు. సొంత చెల్లెళ్లు వైఎస్ షర్మిల, డాక్టర్ సునీతలు చేస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పడం లేదు. అందుకే ఆయన సొంత జిల్లా కడపలో కూడా మూడే స్థానాలు వచ్చాయి. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వంటి వారు కూడా చావుతప్పి కన్ను లొట్టబోయిన చందంగా ఆరేడు వేల స్వల్ప మెజారిటీ తో గెలిచారు. ఇంత జరిగినా జగన్ వైఖరిలో మార్పు రాకపోవడం ఆశ్చర్యంగా ఉంది. రాజకీయం గా వేసిన తప్పటడుగులను సరిచేసుకోవాలన్న ధ్యాస కానరావడం లేదు. ఇది కెసిఆర్ విషయంలోనూ వర్తిస్తుంది. చేసిన తప్పులను పక్కన పెట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తూర్పార పట్టే పనిలో పడ్డారు. శాసనసభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసిన జగన్ సభా కార్యక్రమాల్లో పాల్గొనకుండా నియంతలా వ్యవహరి స్తున్నారు. సభకు హాజరయ్యే విషయంలో కెసిఆర్, జగన్‌ల తీరు ఒకేలా ఉంది. తాము ఇద్దరమూ శాశ్వతంగా అధికారంలో ఉంటామని కలలు కన్నారు. అందుకే ప్యాలెస్‌లు కట్టుకున్నారు. ప్రజల ధనంతో విలాసాలు అనుభవించారు. సమాజంలో కళ్లెదురుగా హత్యలు చేసిన, చేయించిన ఘటనలు చూశాం. ప్రభుత్వ వ్యతిరేకత ఆధారంగా నే ఇటీవలి కాలంలో ప్రజలు తీర్పు ఇస్తున్నారనడానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజలు ఇచ్చిన తీర్పు నిదర్శనంగ ఆచూడాలి. అలాగే ఏకపక్షంగా వెళ్లిన మోడీకి కూడా ఓటమి ఎలా ఉంటుందో రుచి చూపారు. గత ఐదేళ్ల పాలనా అనుభవాలను దృష్టిలో పెట్టుకొని కెసిఆర్, జగన్‌లు తమ విధానాలు మార్చుకోవాలి. పాశ్చాత్తాపం ప్రకటించాలి. చేసిన తప్పులకు పడే శిక్షలకు సిద్దంగా ఉండాలి. అధికారంలో ఉండగా చేసిన తప్పులకు శిక్షలు పడాలి. అవి త్వరగా నిర్ధారణ కావాలి. లోక్‌పాల్ వంటి వ్యవస్థను ఏర్పాటు చేస్తేనే పాలకుల అవినీతిని అరికట్టగలం. వ్యవస్థను గాడిలో పెట్టుకోగలం.

# అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్

## -నేడు ఆయన వర్ధంతి



మానవ జాతి వికాసానికి సృష్టి అందించిన వరప్రసాదమే సర్ ఆర్ధ్ కాటన్. మదరాసు రాష్ట్రంలో వారు అమలు చేసిన నీటి పారుదల పనులు అద్వితీయమైన విజయాలు సాధించాయి. సర్ ఆర్థర్ కాటన్ దూరదృష్టి, సునిశిత మేధాశక్తి అమోఘం, అద్వితీయం. దక్షిణ భారతావనిలో ఎన్నో నీటి పారుదల రూపకల్పన చేసిన అన్న దాత సర్ ఆర్థర్ కాటన్ ను ప్రభుత్వం సముచితంగా అనేక బిరుదులతో సన్మానించింది.1803 మే 15వ తేది కాటన్ జన్మించారు. కుటుంబంలో అందరికంటే తల్లి వ్యక్తిత్వ ప్రభావం ఆయనపై పడింది. కాటన్ చిన్నతనం నుంచి మనో వికాసానికి సాహసానికి, ధైర్యానికి, దీక్షకు మారుపేరు. తల్లి ఇచ్చిన శిక్షణ కాటన్ కి ఎంతో ఉపక రించింది. 15 ఏళ్ళ ప్రాయంలో ఇండియాకు వెళ్ళడానికి స్కాలర్ షిప్ పొందారు. 1819 సంవత్సరానికి ఆర్థర్ కాటన్ జాగ్రత్తగా చదువుకొని మంచి క్రమశిక్షణతో మెలిగి అది స్కాంబి లో చక్కగా విద్యనభ్యసించి ఏ పరీక్షకు హాజరు కాకుండానే రాయల్ ఇంజనీర్ సర్టిఫికేట్ ఆధారంగా ఉద్యోగం సంపాదించారు. 1821 లో 18 సంవత్సర ప్రాయంలో ఇండియాలో ఉద్యోగంలో నియమింపబడ్డారు. 1822 సంవత్సరంలో అనేక జిల్లాల్లోని చెరువు మరమత్తు పనులను పర్యవేక్షించే పనిని అప్పగించారు. 1824 సం?? వరకు ఈవిధంగా పనిచేసి మద్రాసు దక్షిణాన కొన్ని మైళ్ళ దూరంతో వున్న మిలిటరీ స్థావరమైన థామస్ మౌంట్ దగ్గర భవనాలు నిర్మించడానికి నియమించబడిరి. ఎనిమిదేళ్ళ సర్వీసు అయిన తర్వాత కెప్టెన్ ర్యాంక్ కు ఎదగారు. ఆయల కృషి వల్ల తంజావూరు జిల్లాలోని అనే నిర్మాణపు పనులు పూర్తి అయి రాష్టంతో సంపన్న జిల్లా గా మారింది.1828 - 29 సం?? లలో అనేక ప్రణాళికలకు రూపకల్పన చేశారు. తరువాత అనారోగ్య కారణాలవల్ల ఇంగ్లాండు తిరిగి వెళ్ళనలసి వచ్చింది. 1832 లో తిరిగి ఉద్యోగంలో ప్రవేశించారు. శక్తికి మించిన శ్రమ చేయడం వల్ల తరచు అనారోగ్యానికి గురయ్యేవారు. ఈసారి ఆస్ట్రేలియాకు వెళ్ళవలసి వచ్చింది. అక్కడ వుండగా ఒక ధనవంతుని కుమార్తె ఎలిజబెత్ ని ప్రేమించి వివాహమాడారి. 1841 సం?? లో అక్టోబరు 10వ తేదీన వీరి వివాహం జరిగింది. తరువాత తిరిగి టాస్మోనియా వెళ్ళారు. ఆ సమయంలో రాజమండ్రి జిల్లా పరిస్తితి అధ్వాహ్నంగా ఉండేది. గోదావరి తో పారే నీటిని వినియోగించి ఆ భూములను సస్యశ్యామలం చేయటం జరిగింది. అప్పటినుంచీ రాజమండ్రి జిల్లా గోదావరి జిల్లా గా పేరు గాంచింది. గోదావరి నదిపై 12 లక్షల ఎకరాల సాగుకు ఉపయోగపడే ఒక ఆనకట్ట నిర్మించబడింది. ఈ ఆనకట నిర్మాణం ద్వారా ఆయన కన్న కలలు నిజమయ్యాయి. కాల్వలు తరువాత కాల్వలు, పిల్లకాత్వతు, పంట కాల్వలు త్రవ్వడం జరిగింది. 1841 నుండి 45 సం??లు నీటి పారుదల పథకాల అమలుకై ఆయన నిర్విరామ కృషి చేశారు. 1881 వ సం??లో ప్రచురించిన "వీలున్నచోట నీటి పారుదలకు కాల్వలను ఏర్పాటు చేయాలి. వర్షపు నీరు, బావి నీరు, ఇతర విధానాల ద్వారా లభించే నీటి కన్నా భూమిని సారవంతం చేసే ఎరువు గల్గిన నీటుని పొలాలలకు కాల్వల దారా పారించవచ్చును. "ఒక చోటినుండి ఇంకొక చోటికి ఉత్పత్తులను కారు చౌక ఎగుమతి చేయడానికి నీటి కంటే మరొక ఉత్తమ సాధనం లేదు. ఆ కారణంగా నీటి పారుదల కాల్వలను స్టీమ్ బోట్ లు తిరగడానికి వాలుగా నౌకాయాన సౌకర్యాలు కల్పించారు. ధవళేశ్వరం ఆలకట్ట నిర్మాణంలో సర్ ఆర్థర్ కాటన్ చూపిన ప్రతిభాపాటవాలు నేటికి మరువలేనివి. ఈ బ్యారేజి నిర్మాణం వల్ల గోదావరి డెల్టాలో 13,75,000 టన్నులు, ధాన్యము, 16,38,000 చెరుకు, 34,000 టన్నుల పప్పు ధాన్యము, చిరుధాన్యాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఈ వ్యారేజి నిడిని 3.6. కి.మీ. దేశంతో కెల్ల అతి పెద్దదైల ధవళేశ్వరం బ్యారేజి సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజిగా పిలువ బడుతున్నది. ఇండియాలో పబ్లిక్ వర్క్ అనే పుస్తకాన్ని కూడా ఆయన రాసారు. మానవ జాతి మహోదయానికి ఇంజనీరుగా రచయితగా ఆలోచలా పరులుగా శ్రీ కాటన్ చేసిన కృషి చిరస్మరణీయమైంది. ఆయన పేదరిక నిర్మూలనకు కరువు నివారణకు అనేక నీటి పథకాలు అమలు చేసి చరిత్ర ప్రసిద్ధుడైయాడు. ఎన్ని పనులు చేసినా ఆయన సామాన్యుడే. ధర్మాన్ని నిర్వర్తించాడు. అభివృద్ధే ఆయన ఆదర్శం. అందుకే ఆయనను అన్నదాతగా పిలిచేవారు. ప్రజల హృదయాలలో శాశ్విత స్థానాన్ని ఏర్పరచుకొని 1899 జులై 24వ తేది పరమపదించారు.

# ఆదాయం పెంచుకోనేది ఎలా

విజయవాడ, జూలై 23 ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఖజానాకు వచ్చే ఆదాయం గత కొన్నేళ్ళుగా తగ్గిపోతోంది. 2014-19 మధ్య అంతంత మాత్రంగా ఉన్న ఆదాయం ఆ తర్వాత గణనీయంగా పడిపోయింది. ఇందులో విధానపరమైన లోపాలతో పాటు పన్ను ఎగవేతలు యథేచ్ఛగా సాగడమే దీనికి ప్రధాన కారణం.జిఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత ప్రజలు చెల్లించే పన్నులు, ప్రభుత్వానికి జమ చేసే పన్నుల్లో వ్యత్యాసం పెరిగిపోయింది. కొన్నేళ్ళ క్రితం ఓ ఉద్యోగ సంఘంతో ప్రభుత్వానికి ఘర్షణ వైఖరి ఏర్పడటానికి కారణం కూడా ఇదేననే ప్రచారం ఉంది. పన్నుల వసూళ్లను నేరుగా పర్యవేక్షించే శాఖల్లో కొందరి చేతివాటంతో ఖజానాకు రావాల్సిన ఆదాయానికి భారీగా గండిపడుతోందనే ఆరోపణలు ఉన్నాయి. జిఎస్టీ వసూళ్లలో ప్రభుత్వానికి- పన్ను చెల్లింపు దారులకు మధ్య వ్యాపారులు మాత్రమే ఉంటారు.కొనుగోలు దారుడు చెల్లించే పన్ను ప్రభుత్వానికి సక్రమంగా చేరుతుందా లేదో పర్యవేక్షించే యంత్రాంగం మాత్రం గాడి తప్పింది. ఇలా కొన్ని వందల కోట్ల రుపాయలు దారి మళ్లాయనే ఆరోపణలపై పోలీస్ కేసులు కూడా నమోదయ్యాయి. వీటి విచారణ ఎటూ తేలలేదు.జిఎస్టీ వసూళ్లతో పాటు ఏపీలో సేల్స్ టాక్స్ ద్వారా వచ్చే ఆదాయానికి కూడా భారీగా గండి పడింది. పెట్రోల్, డీసెల్, గ్యాస్ అమ్మకాలపై వచ్చే ఆదాయంలో గత ఐదేళ్లలో దాదాపు రూ.3500కోట్ల రుపాయలకు గండిపడింది. దీనికి ప్రధాన కారణం ఏపీతో పోలిస్తే పొరుగు రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తక్కువగా ఉండటమే ప్రధాన కారణం.2018-19లో ఏపీలో సేల్స్ టాక్స్ ఆదాయం రూ.22వేల కోట్ల రుపాయలుగా ఉంటే 2023-24కు అది రూ.18,500కోట్లకు పడిపోయింది. ఐదేళ్లలో దాదాపు రూ.3500కోట్ల ఆదాయాన్ని ఏపీ కోల్పోయింది. ఇలా సేల్స్ టాక్స్ ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం మొత్తం కర్ణాటక, తెలంగాణ, ఒడిశా వంటి పొరుగు రాష్ట్రాలకు వెళ్లిపోయింది. ఆ రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో ఇంధన సుంకాలు అధికంగా ఉండటంతో ఏపీలో అమ్మకాలు పడిపోయాయి.ఏపీలో ఐదేళ్లలో సేల్స్ టాక్స్ రూపంలో ఐదేళ్లలో రూ.3500కోట్ల రుపాయల ఆదాయాన్ని కోల్పోతే పొరుగున ఉన్న తెలంగాణలో 2018-19లో 19వేల కోట్ల నుంచి 2023-24నాటికి రూ.29వేల కోట్ల రుపాయలకు ఆదాయాన్ని పెంచుకోగలిగింది. సేల్స్ టాక్స్‌తో పాటు రిజిస్ట్రేషన్ ఆదాయం కూడా ఐదేళ్లలో గణనీయంగా పడిపోయినట్టు ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయిఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదాయం పడిపోవడానికి విధానపరమైన లోపాలే ప్రధాన కారణంగా కనిపిస్తాయి. ప్రభుత్వంతో వ్యాపారానికి మల్టీ నేషనల్ కంపెనీలు సుముఖత చూపడం లేదు. ప్రభుత్వంతో వ్యాపార ఒప్పందాలు చేసుకోడానికి వెండర్లు, డిస్ట్రిబ్యూటర్లు ఏ మాత్రం ఆసక్తి చూపడం లేదు.కాంట్రాక్టులు దక్కిన నాటి నుంచి బిల్లులు చెల్లించే సమయానికి లాభాల మాట అటుంచితే వడ్డీలు పెరిగిపోతున్నాయనే ఆందోళన ఆ వర్గాల్లో ఉంది. ఓ వైపు పన్ను వసూళ్లలో ఉద్యోగుల నిర్లక్ష్యం, చేతివాటం, మరోవైపు ప్రభుత్వంతో వ్యాపారం లేకపోవడంతో ఖజానాకు గండిపడుతోంది.సంక్షేమ పథకాలను అమలు చేయడం, ప్రభుత్వ కార్యక్రమాలను గాడిన పెట్టడం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలంటే కనీసం మొదటి రెండేళ్లు పూర్తిగా అప్పులపై నడవక తప్పని పరిస్థితులు ఏపీలో ఉన్నాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణ పనులు ప్రారంభించాలంటే 2019నాటికి కాంట్రాక్టర్లకు దాదాపు రూ.9వేల కోట్ల రుపాయల బిల్లులు చెల్లించాల్సి ఉంది.వాటిలో కనీసం సగమైనా చెల్లిస్తే తప్ప ఆ పనులు తిరిగి ప్రారంభించే పరిస్థితులు లేవు. 2019-20 ఆర్థిక సంవత్సరంలో విద్యార్థినులకు ఉచితంగా అందించే శానిటరీ నాప్‌కిన్స్ సప్లై చేసిన బహుళజాతి కంపెనీకి రూ.2.70కోట్ల రుపాయలు ఐదేళ్లుగా చెల్లించలేదు. దీంతో ఆ కంపెనీ ఏపీ ప్రభుత్వంతో ఎలాంటి వ్యాపార లావాదేవీలు పెట్టుకోవద్దని డిస్ట్రిబ్యూటర్లపై ఆంక్షలు విధించింది.ఆంధ్రప్రదేశ్ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రాష్ట్రాన్ని గాడిన పడాలంటే దానికి ప్రభుత్వం చాలా తీవ్రంగా శ్రమించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. అదే సమయంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు, పెట్టుబడులకు ఖచ్చితమైన భరోసా, పరిశ్రమలకు సురక్షితమైన వాతావరణం, ఆంధ్రప్రదేశ్‌లో స్థిరమైన రాజకీయ వాతావరణం కూడా అత్యవసరంగా కనిపిస్తోంది. రాజకీయాలతో పాటు శాంతిభద్రతలు కూడా రాష్ట్రాన్ని గాడిన పెడితేనే ఏపీ అభివృద్ధి బాటలో నడవగలుగుతుంది.

# జగన్ ధర్నా వెనుక బిగ్ ప్లానింగ్

గుంటూరు, జూలై 23, వై నాట్ 175 అంటూ మళ్లీ అధికారంలోకి రావాలని కలలు కన్న జగన్ కనీసం ప్రతిపక్ష హోదా కు అర్హులైన ఎమ్మెల్యేలను సైతం గెలిపించుకోలేకపోయారు. ఉన్న ఆ కొద్దిపాటి ఎమ్మెల్యేలు కూడా టీడీపీ, బీజేపీ వైపు చూస్తున్నారని వార్తలొస్తున్నాయి. ఇలాంటి క్లిష్టపరిస్థితిలో వైఎస్ఆర్ సీపీని మళ్లీ క్షేత్ర స్థాయిలో బలోపేతం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని జగన్ భావిస్తున్నారు. ముందు ముందు జరిగే స్థానిక సంస్థల ఎన్నికలలోనైనా టీడీపీని ధీటుగా ఎదుర్కోవాలంటే..ఏదో ఒకటి చేసి ప్రజల దృష్టిలో పడాలి. అధికారంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వాన్ని ఇబ్బందుల పాలు చెయ్యాలి. అంతకన్నా ముఖ్యంగా నిస్తేజంలో ఉన్న పార్టీ శ్రేణులను ఉత్సాహపరచాలి. అందుకే ఆ దిశగా జగన్ ముందుకు సాగాలని ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది.ఇటీవల ఏపీలో సంచలనం కలిగించిన రషీద్ హత్యపై జగన్ తీవ్రస్థాయిలో స్పందించారు. తమ పార్టీకి చెందిన కార్యకర్తను అత్యంత కిరాతకంగా నడిరోడ్డున హత్య చేశారని టీడీపీ పై విరుచుకుపడ్డారు జగన్. తెలుగు తమ్ముళ్లు కూడా తగ్గేది లే అంటూ వైఎస్ఆర్ సీపీనే కావాలని హత్య చేయించి హత్యారాజకీయాలకు తెరతీసిందని చెబుతోంది. దీనిపై రషీద్ కుటుంబాన్ని పరామర్శించడానికి వెళుతున్ సమయంలో జగన్ కాన్వాయ్ ని పోలీసులు అడ్డుకున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న హింసా కాండపై అటు గవర్నర్ కు, రాష్ట్రపతికి లేఖలు కూడా రాశారు జగన్. ఇక ఇవన్నీ కాదని ఈ నెల 24న ఢిల్లీ లో ఏపీలో జరుగుతున్న హత్యా రాజకీయాలకు నిరసనగా ధర్నా చేయాలని నిర్ణయించుకున్నారు.ఇదేదో తేలికగా తీసుకోవాల్సిన అంశం కాదు. జగన్ ధర్నా వెనుక పెద్ద స్కెచ్చే ఉందంటున్నారు రాజకీయ వర్గాలు.23న కేంద్ర బడ్జెట్ ప్రవేశపెడుతున్నారు. అదే సమయంలో రాష్ట్ర సమస్యను పార్లమెంట్ లో వైసీపీ ఎంపీలు చర్చించే అవకాశం ఉంది. దీనిని జాతీయ సమస్యగా మలిచి టీడీపీని ఇబ్బంది పెట్టాలని భావిస్తున్నారు జగన్. ఆయన ధర్నా చేసే సమయానికి సరిగ్గా ఏపీలో రషీద్ హత్య జరిగి వారం అవుతుంది. వారం రోజులైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని వాదించవచ్చు. వీటన్నింటికన్నా ముఖ్యంగా ఏపీలో వైసీపీ శ్రేణులకు తమ పార్టీ యాక్టివ్ గా ఉందని..వాళ్లలో కొత్త ఉత్సాహం ఇవ్వవచ్చని భావిస్తున్నారు జగన్. అందుకే రాష్ట్రంలో ఏ చిన్న అంశాన్నీ వదలకూడదు అని నిర్ణయించుకున్నారు జగన్.అడుగడుగునా టీడీపీని ఇరకాటంలో పెట్టి తగ్గిపోతున్న తన ప్రాభవాన్ని తిరిగి తెచ్చుకోవాలని..వచ్చే ఎన్నికలకు పార్టీని బలోపేతం చేయాలని జగన్ భావిస్తున్నట్లు కనిపిస్తోంది. కేంద్రంలో ఎలాగూ బడ్జెట్ సమావేశాలు జరుగుతుంటాయి. బయట ధర్నా చేసే జగన్ కు జాతీయ మీడియాలో మంచి కవరేజ్ వస్తుంది. కోట్లు ఖర్చుపెట్టినా రాని పబ్లిసిటీ కేవలం ధర్నా ద్వారా జాతీయ మీడియాలో ఏపీ పరిస్థితిని వివరించవచ్చని జగన్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే సంకీర్ణ కూటమి లో భాగస్వామి అయిన టీడీపీ పార్టీపై కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు అంతా. బీజేపీ అలాంటి సాహసం చేయదని తెలుస్తోంది. ప్రయత్నిస్తే పోయేది ఏముంది కనీసం వైసీపీ వార్తలలోనైనా ఉంటుంది. ఈ కార్యక్రమం కార్యకర్తలలో నూతనోత్సాహం కలిగిస్తుంది.

# నేడు నవయుగ కవి చక్రవర్తి 'పద్మభూషణ్ ' గుర్రం జాషువా

## -నేడు ఆయన వర్ధంతి



ఒక అంటరాని వాడు,పవిత్రమైన హిందూ గ్రంథాలు ,కావ్యాలు చదువుతున్నాడని ఇటు హిందూ ఛాందసులు కన్నెర్రజేస్తే, క్రైస్తవుడైవుండి హిందూ నాటకాలు రాసి హిందూమతప్రచారానికి తోడ్పడుతున్నాడని క్రైస్తవ మతాధిపతుల ఆగ్రహానికి గురైన జాషువా 1895 సెప్టెంబరు 28 న, గుంటూరు జిల్లా వినుకొండలో జన్మించారు.తండ్రి వీరయ్యది యాదవ కులం,తల్లి లింగమ్మ క్రైస్తవ మతస్థురాలు. ఒక వంక దారిద్ర్యం, మరోవంక కుల మత పోటు. బాల్యంనుంచే జాషువా ఎన్నో అవమానాల్ని, అవహేళనల్ని,ఛీత్కారాలను ఎదుర్కొన్నారు. చిన్నతనం నుంచే తిరగబడే తత్త్వంతో వీటన్నింటినీ అధిగమించిన జాషువా, విద్యార్థి దశనుంచే వ్యంగచిత్రాలు గీయడం, గొల్లసుద్దులు పాడుకోవడం,ఇలా లలిత కళల పట్ల ఆసక్తి పెంచుకోవడం ప్రారంభించారు. దీపాల పిచ్చయ్యశాస్త్రి, జూపూడి హనుమచ్ఛాస్త్రి వంటి కొందరు జాషువా ఉన్నతికి తోడ్పడితే, మరికొందరు జాషువాను కులంపేరుతో తీవ్రంగా అవమానించారు.జీవితంలో ఎన్నోసార్లు, ఎన్నోచోట్ల జాషువా కవిత్వం విని ఆనందించిన వారు, కరతాళ ధ్వనులతో తమ హర్షాన్నిప్రకటించిన వారు, అతని కులం తెలుసుకొని అవమానించారని, జాషువా ఆవేదన పడినా,నిరుత్సాహంతో క్రుంగిపోక ''కళకు కులమతాలున్నాయా?'' అని ప్రశ్నిస్తూ, వాటిని ఆత్మస్థైర్యంతో ఎదుర్కొని గొప్పకవిగా ఖ్యాతిని పొందారు.''విశ్వనరుడ నేను'' అని సామాజిక వాస్తవికతను నిర్భయంగా చాటారు. భారతవీరుడు'అనే పద్యకావ్యాన్ని,'రుక్మిణీకళ్యాణం'అనేనాటకాన్ని, ఇక...ఫిరదౌసి, గబ్బిలం, నేతాజీ, బాపూజీ,,క్రీస్తు చరిత్ర,ముంతాజ్ మహల్(ఈ కావ్యాన్ని తాను అమితంగా ప్రేమించిన తన తల్లికి అంకితం ఇచ్చారు),శ్మశానవాటిక వంటి ఖండకావ్యాలు ఎన్నో రాసారు. మరెన్నో కవితా ఖండికలు అలనాటి ప్రముఖ సాహిత్య మాసపత్రిక 'భారతి 'లో వెలువరించారు. కవితావిశారద, కవికోకిల, కవిదిగ్గజ, నవయుగ కవిచక్రవర్తి, మధుర శ్రీనాథ లాంటి బిరుదులను సాహితీ ప్రియులు ప్రదానం చేస్తే,ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, కేంద్ర సాహిత్య అకాడమీ, అవార్డులతో సత్కరించాయి.వీటన్నిటికీ మకుటాయమానంగా భారత ప్రభుత్వం 'పద్మభూషణ్ 'అవార్డుతో విశిష్ట పురస్కారాన్ని అందజేసింది.

"రాజు మరణించె, నొక తార రాలిపోయె
కవియు మరణించె ,నొక తార గగనమెక్కె
రాజు జీవించె ఱాతి విగ్రహములందు
సుకవి జీవించె ప్రజల నాలుకల యందు"

అన్న జాషువా, ఆణిముత్యాల్లాంటి రచనలను తెలుగుజాతికి అందించిన జాషువా , 1971 జులై 24 న గుంటూరులో కీర్తిశేషులయ్యారు.

## ఏపీ, బీహార్ కు భారీగా నిధులు

న్యూఢిల్లీ, జూలై 24, (న్యూస్ పల్స్) ఎన్డీయే 3.0 కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామ్యంగా ఉన్న ఏపీ, బీహార్‌లకు కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ) వరాల జల్లు కురిపించారు. ఏపీలో రాజధాని అమరావతికిప్రత్యేక ఆర్థిక సాయం ప్రకటించారు. అలాగే, నితీశ్ కుమార్ నేతృత్వంలోని బీహార్‌కు పలు అభివృద్ధి, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ప్రకటించారు. అయితే, బీహార్‌కు ప్రత్యేక హోదా ప్రకటించాలన్న డిమాండ్‌ను మాత్రం కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి బీహార్‌లో వివిద ప్రాజెక్టుల కోసం రూ.26 వేల కోట్లు కేటాయించారు. అక్కడ ఎయిర్ పోర్టులు, విమానాశ్రయాలు, వైద్య కళాశాలలు, క్రీడా మౌలిక సదుపాయాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని చెప్పారు. అలాగే, జార్ఖండ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల అభివృద్ధికి కూడా ప్రణాళిక రూపొందిస్తామన్నారు.కేంద్ర ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఏపీకి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలమ్మ ఈసారి బడ్జెట్‌లో వరాల జల్లు కురిపించారు. విభజన తర్వాత ఆర్థికంగా నష్టపోయిన రాష్ట్రానికి ఆర్థిక సాయం ప్రకటించి చేయూత అందించారు. రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయం ప్రకటించారు. అవసరాన్ని బట్టి భవిష్యత్తులో మరిన్ని అదనపు నిధులు ఇస్తామని స్పష్టం చేశారు. అలాగే, పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేయడానికి పూర్తిగా సాయం చేస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, రైతులకు పోలవరం జీవనాడి అని.. భారత ఆహార భద్రతకు పోలవరం ఎంతో కీలకమైనదని చెప్పారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం వెంటనే జరిగేలా చూస్తామన్నారు.ఏపీలో వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వనున్నట్లు నిర్మలమ్మ తెలిపారు. రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ కింద నిధులు కేటాయిస్తామన్నారు. అలాగే, విభజన చట్టం ప్రకారం పారిశ్రామికాభివృద్ధికి సహకారం అందిస్తామని అన్నారు. హైదరాబాద్ - బెంగుళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి కూడా ప్రత్యేక నిధులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలకు నీళ్లు, విద్యుత్, రోడ్లు, హైవేల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని స్పష్టం చేశారు. విశాఖ - చెన్నై పారిశ్రామిక కారిడార్‌లోని నోడ్‌లకు ప్రత్యేక సాయం చేస్తామన్నారు. అలాగే, రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని వెల్లడించారు.బీహార్‌లో కొత్త విమానాశ్రయాలు, వైద్య కళాశాలలు, క్రీడా మౌలిక సదుపాయాలను నిర్మించేందుకు ఆర్థిక సాయం. పీర్ పాయింట్ వద్ద 2,400 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుతో సహా విద్యుత్ ప్రాజెక్టులు చేపడతారు.గయాలో ఇండస్ట్రియల్ నోడ్ అభివృద్ధి, పాట్నా - పూర్ణియా ఎక్స్‌ప్రెస్ వే, బక్సర్ - భాగల్పూర్ హైవే, బోద్‌గయా - రాజ్‌గిర్ - వైశాలి - దర్భంగా, బక్సర్‌లో గంగానదిపై రూ.26 వేల కోట్లతో వంతెనల అభివృద్ధికి సాయం చేస్తామని నిర్మలమ్మ ప్రకటించారు.ఆక్సిలరేటెడ్ ఇరిగేషన్ ఫండ్ ద్వారా బీహార్‌లో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తామన్నారు. అలాగే, టెంపుల్ కారిడార్లు, నలంద యూనివర్శిటీ అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని స్పష్టం చేశారు.టీడీపీ నేతల ధన్యవాదాలుఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్‌లో ప్రాధాన్యం దక్కింది. అమరావతికి రూ. పదిహేను వేల కోట్లు ప్రకటించడంతో పాటు పోలవరం ప్రాజెక్టు వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని ప్రకటించారు. పోలవరానికి పెట్టే ప్రతి ఖర్చు నాబార్డు ద్వారా రీఎంబర్స్ చేస్తారు కాబట్టి బడ్జెట్ లో ప్రత్యేకంగా ఎంత మొత్తం అని చెప్పలేదు. ఇంకా ఏపీకి పారిశ్రామిక కారిడార్లు కూడా ప్రకటించారు.

# బడి తాకట్టు పెట్టేందుకు కారణమైన అధికారులు సస్పెన్షన్

**చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన ముగ్గురు రెవెన్యూ అధికారులు సస్పెండ్**

**అన్ని రెవెన్యూ కార్యాలయాల వద్ద నైట్ వాచ్ మెన్ తప్పనిసరి**

**నిబంధనలకు వ్యతిరేకంగా పని చేస్తే కఠిన చర్యలు తప్పవు**

**జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి**

బద్వేలు,చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్ప డిన ముగ్గురు రెవెన్యూ అధికారుల ను జిల్లా కలెక్ట28ఢిల్లీ బయలుదేరిన వైకాపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగన్నవరంవైకాపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. కాసేపట్లో వైసీపీ అధినేత,మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డితో కలిసి ఎయిర్ ఇండియా విమానంలో ఢిల్లీ వెళ్లారు. ఏపీలో జరుగుతున్న హింసాకాండకు నిరసనగా జగన్మోహన్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఢిల్లీలో ధర్నా చేయనున్నారు.ర్ శివ శంకర్ లోతేటి సస్పెండ్ చేశారు. బద్వేలు రెవెన్యూ డివిజన్, బి.కోడూరుమండలం మున్నెల్లి రెవెన్యూ గ్రామం సర్వే నెంబర్ 755 లో 4.27 ఎకరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు(1985) చెందిన స్థలాన్ని బి.కోడూరు డిప్యూటీ తహాశీల్దార్ (ఎఫ్ ఏ సి)జి.విద్యాసాగర్,(28.10.2023), గ్రామ సర్వేయర్ ఏ.ప్రవీణ్ కుమార్, వీఆర్వో జే. గురవయ్య ముగ్గురు కలసి రికార్డులను వెరిఫై చేయకుండా, ప్రాథమిక విచారణ చేయకుండా దురు ద్దేశ్యంతో, నిబంధనలకు వ్యతిరేకం గా కొండావెంకటసుబ్బమ్మకు మ్యుటేషన్ చేశారు. దీంతో కొండా వెంకట సుబ్బమ్మ 14.2.2024 లో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (ప్యాక్స్)లోమార్టిగేజ్ చేసి రూ.8లక్షల రుణంకూడా తీసుకుంది. ఈమొత్తం వ్యవహారంపై బద్వేల్ ఇంచార్జిఆర్డీవో చంద్రమోహన్ ను విచారణ అధికారిగా నియమించి నివేదికను తెప్పించు కున్న జిల్లా కలెక్టర్ శివ శంకర్ ముగ్గురు రెవెన్యూ అధికారులను తక్షణమే సస్పెండ్ చేశారు. అంతే కాక వీరిపై క్రమశిక్షణా చర్యల్లో భాగంగా చార్జెస్ ను కూడా ఫ్రేమ్ చేశారు. ఇక మీదటఏఅధికారి చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడిన, నిబంధనలకు వ్యతిరేకంగా చేసిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.అన్ని రెవెన్యూ కార్యాలయాలకు నైట్ వాచ్ మెన్ తప్పనిసరి ఆర్డీవో,తహ శీల్దార్,అన్ని రెవెన్యూ కార్యాలయాలకు నైట్,వాచ్మెన్ లను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవా లని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి ఆదేశిం చారు.

# నకిలీ డాక్టర్ గుట్టు రట్టు

సత్తుపల్లి,ఖమ్మం జిల్లా వేంసూరు మండల కేంద్రంలో ఓ నకిలీ వైద్యుడు కార్పొరేట్ స్థాయిలో ఆసుపత్రిని నడుపుతున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. లచ్చన్న గూడెం గ్రామానికి చెందిన ఏకే ప్రసాద్ అనే డిఫార్మసీ చేసిన వ్యక్తి వైద్యంలో ఎలాంటి అనుభవం లేని ప్రసాద్ మర్లపాడు సెంటర్లో పదికి పైగా పడకలు ఏర్పాటు చేసి ఓ ఆసుపత్రిని నిర్వహిస్తున్నారు. మెడికల్ షాప్ తో ప్రారంభమైన తన వ్యాపారం అంచెలంచెలుగా పెరుగుతూ ఒక కార్పొరేట్ స్థాయిలో పదికి పైగా పడకలు ఏర్పాటుచేసి తానే స్వయంగా వైద్యం చేయడం ప్రారంభించాడు. ఈ నకిలీ వైద్యుడు వద్ద వైద్యం చేయించుకునేందుకు అటు ఆంధ్ర గ్రామాల నుంచి ఇటు తెలంగాణ గ్రామాల నుంచి కుప్పలు కుప్పలుగా రోగులు వస్తుంటారు. నకిలీ ఆసుపత్రికి కూతవేటు దూరంలోనే వేంసూరు ప్రభుత్వాసుపత్రి ఉంటుంది. ఈ ఆసుపత్రిలో మెడికల్ ఆఫీసర్ గా, అడిషనల్ డిఎం అండ్ హెచ్ ఓ గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సీతారాం... నకిలీ ఆసుపత్రి నడుపుతున్నా ఈ నకిలీ వైద్యుడు పై ఏనాడు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఆసుపత్రి పై అధికారులు డులు నిర్వహించారు. వేంసూరు మండలం లోని మర్లపాడు గ్రామం లో అనాధికారకంగా 10కి పైగా పడకల ఆసుపత్రి నిర్వహిస్తున్న నకిలీ వైద్యుడు కు నోటీసులు ఇచ్చారు. మెడికల్ స్టోర్ పేరుతో డాక్టరు లేకుండానే రోగులకు వైద్యం చేస్తుండగా డిప్యూటీ డీఎంహెచ్వో దాడులు చేసి నోటీసులు ఇవ్వడం జరిగింది. డిఎం అండ్ హెచ్ ఓ నకిలీ ఆసుపత్రిని సందర్శించిన సమయంలో బెడ్లు అయి రోగులకు కిటికీలకు సెలైన్ బాటిల్స్ కట్టి వేలాడదీస్తూ రోగులకు ఎక్కించడం అక్కడ పరిస్థితిని చూపిస్తుంది. ఇదే నకిలీ వైద్యుడు గతంలో కూడా డెంగ్యూ లాంటి వ్యాధులకు వైద్యం చేసిన దాఖలాలు వచ్చినప్పటికీ కూడా క్షమించాను అంటూ మాట్లాడటం కొసమెరుపు. ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామాలలో వైద్యం చెయ్యకూడదని, అలాంటి వారి పై చర్యలు తీసుకుంటామని వైద్య ఆరోగ్య అధికారులు తెలిపారు. ఆర్ఎంపి వైద్యం పేరుతో కార్పొరేట్ స్థాయి ఆసుపత్రి నిర్వహించడం ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించినట్లు అవుతుందని అధికారులు అంటున్నారు.ఇట్టి విషయం పై ఆసుపత్రి నిర్వహిస్తున్న ఎకే ప్రసాద్ ను వివరణ కోరగా తాను 10 ఏళ్ల నుంచి వైద్యం చేస్తున్నాను, తన తండ్రి ఆర్ఎంపి వైద్యుడు గా పని చెయ్యడంతో తాను కూడా అదే వృత్తి కొనసాగిస్తున్నానని, కేవలం డి ఫార్మసీ చదివి మెడికల్ షాపు తో పాటు బెడ్లు వేసి వైద్యం చేస్తున్నానని స్వయంగా అంగీకరించాడు. తన ఆసుపత్రిని డిప్యూటీ డిఎంహెచ్వో పరిశీలించి ఎలాంటి అనుమతులు లేని కారణంగా ఆసుపత్రి పేరుతో వైద్యం చెయ్యకూడదు అని నోటీసులు ఇవ్వడం జరిగిందని ఆయన వివరించారు.

# చాప చుట్టేస్తారా....

విజయవాడ, జూలై 23, వైసీపీలో నేతల వలసలు ప్రారంభమయ్యాయి. కొందరు టీడీపీలోకి, మరికొందరు జనసేనలోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. కార్పొరేటర్ల స్థాయి నుంచి ఇప్పుడే వలసల పర్వం మొదలయింది. ఇక ఆగేట్లు లేదు. ఎందుకంటే ఇంకా ఐదేళ్లు అధికారంలో లేకుండా ఉండలేని పరిస్థితి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఇప్పటి వరకూ వైసీపీ పాలనలోనే ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సహజంగా ఎమ్మెల్యేలు తమ పట్టును నిరూపించుకునేందుకు వలసలను ప్రోత్సహిస్తారు. పార్టీలో చేర్చుకుంటారు. వాళ్లకు కావాల్సింది అధికార పార్టీలో ఉండటం. ఎమ్మెల్యేలకు కావాల్సింది స్థానిక సంస్థల మీద పట్టు పెంచుకోవడం. నాడు దగ్గర తీసిన నేతలే.... దీంతో వైసీపీలో నేతలు ఇక మిగలరన్నది వాస్తవం. ఇన్నాళ్లు నా ఎస్టీలు.. నాఎస్సీలు.. నా బీసీలు.. నా మైనారిటీలు అంటూ ఎక్కువ పదవులను జగన్ వారికే కట్టబెట్టారు. ఇప్పుడు ఎక్కువశాతం మంది పార్టీ మారే వాళ్లలో వారే ఉంటున్నారు. ఎమ్మెల్యేలు చేసే ప్రలోభాలను చూసికావచ్చు. ఐదేళ్ల తర్వాత చూసుకుందాంలే అన్న ధీమా కావచ్చు. వరసగా నేతలు కూటమి పార్టీ వైపు చూస్తున్నారు. ప్రతిపక్షంలో ఉంటే తమకు నిధులు అందవు. ఆధిపత్యం కొనసాగించడానికి వీలుండదు. నామినేటెడ్ పనులు కూడా చేసుకునే వీలుండదు. అందుకే అన్నీ దక్కాలంటే జెండా మార్చేయడమే బెటర్ అన్న ఆలోచన అందరిలోనూ బయలుదేరింది. . మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పుంగనూరులో ఇప్పటికే మున్సిపల్ కౌన్సిలర్లు పార్టీని వీడారు. ఇక తాజాగా విశాఖలో ఇరవై మంది వరకూ వైసీపీ కార్పొరేటర్లు టీడీపీ, జనసేనలో చేరిపోతున్నారు. విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ త్వరలోనే కూటమి పరం కానుంది. మేయర్ లను, మున్సిపల్ ఛైర్మన్ లను దించి తమ వారిని పదవిలో కూర్చోబెట్టడమే అధికార పార్టీ లక్ష్యం.

# నిన్న విశాఖ... ఇవాళ తిరుపతి

**కార్పొరేషన్లపై సైకిల్ గురి**

తిరుపతి, జూలై 23 తిరుపతి కార్పొరేషన్. ఎన్నికల ముందు దాకా ఒకే పార్టీది ఆధిపత్యం. తిరుగులేని నాయకత్వం. ఇప్పుడు సీన్ మారింది. 50 డివిజన్?లు ఉన్న తిరుపతి కార్పొరేషన్?కు 3 ఏళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో పూర్తి మెజారిటీని వైసీపీ సొంతం చేసుకుంది. 49 డివిజన్లకు ఎన్నికలు జరిగితే 48 స్థానాలను వైసీపీ, ఒక్క డివిజన్ లోనే టిడిపి జెండా ఎగుర వేసింది. మేయర్?గా శిరీష, డిప్యూటీ మేయర్లు?గా భూమన అభినయ్, ముద్దుల నారాయణ ఎన్నిక అయ్యారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా భూమన అభినయ్ తన డిప్యూటీ మేయర్ పదవికి రాజీనామా చేశారు. తిరుపతి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిని చవి చూశారు. దీంతో తిరుపతి కార్పొరేషన్?లో? వైసీపీకి గేమ్ చేంజ్ ప్రారంభమైంది. 2024 ఎన్నికలకు ముందే వైసీపీకి చెందిన 5 మంది కార్పొరేటర్లు పార్టీ మారారు. ఇద్దరు టిడిపిలోకి, ముగ్గురు జనసేనలోకి చేరిపోయారు.ఎన్నికల ముందు ఆ తర్వాత వైసీపీ కార్పొరేటర్లు పార్టీ ఫిర్యాయింపులపై పెద్ద ప్రచారం జరిగింది. ఇక ఫలితాల తర్వాత ఇప్పుడు జంపింగ్?కు కార్పొరేటర్లు ఆసక్తి చూపుతున్నారు. మేయర్ శిరీష ఇప్పటిదాకా ఎలాంటి నిర్ణయం తీసుకోకున్నా డిప్యూటీ మేయర్ పొద్దున నారాయణతో పాటు పలువురు వైసీపీ కార్పొరేటర్లు కూటమిలో చేరేందుకు ఎవరి ప్రయత్నం వాళ్ళు చేసుకుంటున్నారు. జనసేనలోకి జంప్ చేయాలా, లేదంటే టిడిపిలో చేరాలా అన్న సందిగ్ధతలో ఉన్నారు. ఈ మేరకు వారం రోజుల క్రితం జరిగిన కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో సొంత పార్టీ నిర్ణయాలను తప్పుపడుతూ గళమెత్తిన వైసిపి కార్పొరేటర్లు పార్టీని వీడుతున్నట్లు సంకేతాలు ఇచ్చారు. ఇందులో భాగంగానే ఎన్నికల ఫలితాల తరువాత మాజీ ఎమ్మెల్యే భూమన కుటుంబానికి దూరంగా ఉన్న కార్పొరేటర్లు ఇప్పుడు ఏ పార్టీ జెండాను భుజాన ఎత్తుకోవాలో తేలిక తికమక పడుతున్నారు.ఇందులో భాగంగానే తిరుపతిలోని ఒక ప్రైవేటు హోటల్లో వైసీపీ కార్పొరేటర్లు రహస్య సమావేశం అయ్యారు. డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణతో పాటు పలువురు కార్పొరేటర్లు భేటీ అయ్యారు. టిడిపిలోకి పోవాలా జనసేనలోకి జంప్ కావాలా అన్నదానిపై సమాలోచనలు చేసినట్లు తెలుస్తోంది. తిరుపతి కార్పొరేషన్?పై టిడిపి, జనసేన పార్టీలు పట్టు కోసం ప్రయత్నం చేస్తుండడంతో వైసీపీ మెజార్టీ కార్పొరేటర్ల దారిఎటు అన్న దానిపైనే జోరుగా చర్చ నడుస్తోంది. ఏ పార్టీలో చేరేందుకు ఛాన్స్ ఇవ్వాలన్న దానిపై స్పష్టత లేకుండా పోయింది. ఇప్పటికే పొత్తులో భాగంగా ఎమ్మెల్యే టికెట్?ను జనసేనకు ఇచ్చేసిన టిడిపి.. కార్పొరేషన్?పై ఆధిపత్యం కోసం ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగానే ఇప్పటికే టిడిపికున్న ఒక కార్పొరేటర్ ఎన్నికలకు ముందు చేరిన మరో ఇద్దరు కార్పొరేటర్లతో పాటు మెజారిటీ వైసిపి కార్పొరేటర్?లను టిడిపిలోకి ఆహ్వానించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా తిరుపతి టిడిపి ఇన్చార్జ్?తోపాటు ముఖ్య నేతలు ఆ పనిలో ఉండగా, జనసేనలోకి జంపింగ్ ఛాన్స్ ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే ప్రయత్నం చేస్తున్నారు.అసలు వైసీపీ కార్పొరేటర్ల పయనం ఎటువైపు ఉండాలో తెలియని పరిస్థితి నెలకొంది. టిడిపి జనసేనకు సమాన దూరంగానే ఉంటూ రాజకీయం చేస్తున్న సినీ నిర్మాత ఒకరు ఈ వ్యవహారంలో కీలకంగా మారారు. తిరుపతి కార్పొరేటర్ల?ను ఈ పార్టీలోకి వెళ్ళాలో దిశానిర్దేశం చేసే స్థాయిలో ఉన్న ఆ నాయకుడే ఈ తతంగాన్ని నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే మరోవైపు తిరుపతి కార్పొరేషన్ టిడిపి సొంతం కావాల న్న గట్టి ప్రయత్నమే స్థానిక నాయ కత్వం చేస్తుంది. ఇందులో భాగంగానే మేయర్ స్థానాన్ని ఆశిసు_న్న అన్నా రామచంద్రయ్య.. కార్పొరేటర్లు అయిన తన ఇద్దరు కూతుర్లతో కలిసి వైసీపీని వీడి టిడిపి కండువా కప్పుకు న్నారు. ఈ మేరకు కూతురిని తిరుప తి మేయర్ చేయాలని అన్ని ప్రయ త్నాలు చేస్తున్నారు. దీంతో వైసీపీ కార్పొరేటర్లకు ఏ పార్టీకి జై కొట్టాలో కూడా తమ చేతుల్లో లేకుండా పోయిందని అంటున్నారు కొందరు నాయకులు. ఇలా తిరుపతి వైసీపీ కార్పొరేటర్ల భవితవ్యం ఏ పార్టీతో ముడిపడి ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. కూటమి పార్టీల్లో చేర్చుకు నేందుకు రెండు పార్టీల హై కమాండ్ నుంచి ఇప్పటివరకు గ్రీన్ సిగ్నల్ రాకపోవడం కూడా కార్పొరేటర్లను అయోమయానికి గురిచేస్తోంది

# వెంటాడుతన్న షర్మిళ

కడప, జూలై 23,వైఎస్ షర్మిల తన సోదరుడు వైఎస్ జగన్ కు వ్యతిరేకంగా ఎన్నికల సమయంలో సుదీర్ఘ పోరాటం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి జగన్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు నుంచి ఎన్నో విషయాలు ఆమె ఎన్నికల సమయంలో ప్రజల ముందు ఉంచే ప్రయత్నం చేశారు. జగన్ ప్రభుత్వం ఐదేళ్ల పాటు చేసిన అవినీతి, అరాచకాలు ఇవేనంటూ బయటపెట్టారు. ఇలా జగన్ పంటి కింద రాయిలా వై?ఎస్ షర్మిల మారారు. కానీ అన్ని చోట్ల పోటీ చేసినా కాంగ్రెస్ పార్టీ మాత్రం ఎక్కడా గెలవలేదు. కనీసం కడప పార్లమెంటు నియోజకవర్గంలోనూ ఆమె



స్వయంగా పోటీ చేసినా గెలుపు సాధించలేకపోయారు. అయితే ఎన్నికల ఫలితాలు వచ్చాయి. జగన్ దారుణ ఓటమిని చూశారు. కేవలం పదకొండు సీట్లకే పరిమితమయ్యారు. ఎన్నికల సమయంలో వైసీపీ నుంచి వచ్చిన వారిని వచ్చినట్లు పార్టీలో చేర్చుకున్నారు. అంతా చేసినా ఆమె సాధించింది లేదు. జగన్ ను మాత్రం దారుణంగా రాజకీయంగా దెబ్బతీయగలిగారు. కానీ ఎన్నికల ప్రచారంలో వైఎస్ షర్మిల గురించి చంద్రబాబు కోవర్టుగా వచ్చారని విమర్శలు చేయడం మినహా జగన్ అంతకు మించి ఏమీ విమర్శలు చేయలేదు. ఒక రకంగా చెప్పాలంటే వైఎస్ షర్మిలను రాజకీయంగా విమర్శలు చేసిన జగన్ ఫలితాల తర్వాత ఆమె గురించి ఎక్కడా ప్రస్తావించడం మానేశారు. అంటే వైఎస్ షర్మిలను తాను నేతగా కూడా గుర్తించలేదని అర్ధమవుతుంది.కానీ ఎన్నికల ఫలితాల తర్వాత వైఎస్ షర్మిల జగన్ ను వదలి పెట్టడం లేదు. వెంటపడుతూనే ఉన్నారు. వైఎస్ అభిమానులకు ఇది కొంత ఆందోళన కల్గిస్తుంది. జగన్ ఢిల్లీలో ధర్నా చేయడానికి వెళుతుంటే దానిపై కూడా షర్మిల తీవ్ర వ్యాఖ్యలు చేశారు.. జగన్ ఐదేళ్ల పాటుహత్యా రాజకీయాలు చేశారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. సొంత చెల్లెళ్లకు జగన్ వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. బాబాయి హత్యపై ఢిల్లీలో ఎందుకు ధర్నా చేయలేదని ప్రశ్నించారు. వివేకా హంతకులతో జగన్ కలిసి తిరుగుతున్నారని ఆరోపించారు. అసెంబ్లీలో ఉండకుండా జగన్ ఏం చేస్తారని ప్రశ్నించారు. వినుకొండ హత్య వ్యక్తిగత హత్యేనని.. రాజకీయమైంది కాదంటూ జగన్ ను వదలకుండా వెంట పడుతుండటం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.అధికారంలో ఉన్నన్ని రోజులు జగన్ ప్రత్యేక హోదా గురించి మాట్లాడలేదన్నారు. పోలవరం ప్రాజెక్టును, కడప, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీల గురించి పట్టించుకోలేదని మండిపడ్డారు. అదే సమయంలో మూడు రాజధానుల పేరుతో ప్రజలను గందరగోళానికి గురిచేశారని.. వీటన్నిటిపై ఏనాడూ ధర్నా చేయలేదు ఎందుకని ప్రశ్నించారు. మీ పార్టీ కార్యకర్త చనిపోతే ఢిల్లీకి వెళ్లి ధర్నా చేస్తారాయ.. అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకుండా తప్పించుకునేందుకే ఈ ఎత్తు వేశారని ఆరోపించారు. మీ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నదే 11 మంది, ఉన్న ఆ కొద్దిమందైనా అసెంబ్లీలో చర్చలో పాల్గొనరా .. ప్రజావ్యతిరేక బిల్లులపై పాలకపక్షంతో కొట్లాడే అవసరం మీకు లేదనుకుంటున్నారా అని జగన్ ను సూటిగా నిలదీశారు. ఓవైపు రాష్ట్రంలో భారీ వర్షాలకు చాలా మంది జనం వరదల్లో చిక్కుకున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఇల్లూ వాకిలీ నీట మునగడంతో దిక్కుతోచక రోదిస్తున్నారని షర్మిల గుర్తు చేశారు. వారిని పరామర్శించి ధైర్యం చెప్పాలని ఎందుకు అనిపించడం లేదన్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్లు ప్రజల కోసం పనిచేయలేదు కానీ ఇప్పుడు ఢిల్లీకి వెళ్లి ధర్నా చేస్తారంట.. సిగ్గుండాలి కదా అంటూ జగన్ పై షర్మిల తీవ్ర విమర్శలు చేశారు.

# ఏపీ ఫైబర్ లో 1000 కోట్ల వసూళ్లు

విజయవాడ, జూలై 23, గన్ పాలనలో జరిగిన అక్రమాలను వెలికితీసే పనిలో ఉంది టీడీపీ. అప్పట్లో టీడీపీ పై అక్రమ కేసులు బనాయించి చంద్రబాబును జైలుకు పంపడం తెలిసిందే. ఇప్పుడు జగన్ పాలనలో లూప్ హోల్స్ వెతుకుతోంది టీడీపీ. అప్పట్లో వైఎస్ జగన్ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఫైబర్ నెట్ సంస్థలో అక్రమాలు జరిగాయని టీడీపీ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ఇప్పుడు అధికార హోదాలో ఫైబర్ నెట్ సంస్థలో జరిగిన అక్రమాలు వెలికితీస్తోంది. ఇదే క్రమంలో ఇప్పుడు ఫైబర్ నెట్ అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయిమారుమూల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అతి తక్కువ ధరలకే ఫోన్, ఇంటర్నెట్, ఓటీటీల ద్వారా కొత్త సినిమాలు ఇంట్లోనే వీక్షించే విధంగా సేవలందించేందుకు ఏపీ ఫైబర్ నెట్ లిమిటెడ్ (ఞఖాఈఊ) ప్రవేశపెడుతున్నామని ఎంతో ఆర్భాటంగా ఈ పథకాన్ని వైఎస్ జగన్ తీసుకొచ్చారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అద్భుతమైన ప్యాకేజీలతో సామాన్య, మధ్యతరగతి వర్గాల కోసం తీసుకొచ్చిన ఈ పథకం కింద వసూలు చేసిన నిధులన్నీ దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు రావడంతో తెలుగుదేశం ప్రభుత్వం అప్రమత్తమయింది. రూ.950 కోట్ల అక్రమ వసూళ్ళకు పాల్పడ్డారనే ఆరోపణలతో ఆ సంస్థ కార్యాలయాన్ని సీజ్ చేశారు. సంస్థలో పనిచేసే ఉద్యోగుల వివరాలు సేకరించారు. వాళ్లందరినీ ఇళ్లకు పంపించేశారు. సిబ్బందితో సహా కార్యాలయంలోకి ఎవరినీ అనుమతించలేదు. పూర్తిగా పోలీసుల భద్రతతో , నిఘా కెమెరాలను ఏర్పాటు చేసి అధికారులు పర్యవేక్షిస్తున్నారు.దాదాపు 1500 మంది దాకా ఇక్కడ ఉపాధి పొందుతున్నారు. వాళ్లకు జీతాలు కూడా లక్షల్లో ఇచ్చారు. వీళ్లందరికీ రాజకీయ నేతల సపోర్టు కూడా ఉంది. వాళ్ల రికమెండేషన్ తో లక్షల శాలరీని పొందుతూ ఎంజాయ్ చేశారు ఉద్యోగులు. దాదాపు 10 లక్షల కనెక్షన్లు ఉండేవి మొదట్లో. క్రమంగా నాలుగు లక్షల యాభై వేలకు పడిపోయాయి కనెక్షన్లు. తక్కువ రేటుకే ఇంటర్నెట్, సినిమాలు, ఫోన్ సదుపాయం ఉండటంతో ఆకర్షితులయ్యారు కస్టమర్లు. అయితే ఆ తర్వాత వారు ఊదరగొట్టినట్లుగా సేవలను అందించలేకపోవడంతో అనూహ్యంగా కనెక్షన్లు తగ్గిపోవడం ప్రారంభం అయింది. ఇక ఫైబర్ నెట్ సంస్థకు సంబంధించి సెట్ టాప్ బాక్స్ లు, విద్యుత్ పరికరాల కొనుగోళ్లలోనూ సిబ్బంది చేతివాటం ఉన్నట్లు చెబుతున్నారు.ప్రస్తుతం పోలీసు వలయంలో ఫైబర్ నెట్ సంస్థ ఉంది. సంస్థ ఎండీ పాత్ర ఏమిటి? ఆయన వెనక ఉన్న రాజకీయ నేతలు ఎవరు? ఇందులో వాళ్ల వాటా ఎంత? తదితర అంశాలపై త్వరలో విచారణ జరుపనున్నారు. ఆలస్యం అయితే కీలక సాక్ష్యాలు మాయం అవుతాయని ప్రభుత్వ అధికారులు భావిస్తున్నారు. అందుకే సాధ్యమైనంత త్వరగా ఫైబర్ నెట్ అక్రమాలపై దర్యాప్తు ఆదేశాలు వస్తాయని ఆశిస్తున్నారు.సంస్థ ప్రధాన కార్యాలయం విజయవాడలో ఉంది. దర్యాప్తులో నిజమేనని తేలితే..దాని పర్యవసనాలు తీవ్రంగానే ఉంటాయని భావిస్తున్నారు. అల్పాదాయ వర్గాలపై ప్రేమ కురిపిస్తున్నామని చెబుతూ వారి నుంచి సంవత్సర చందాలను కట్టించుకుని ఆ డబ్బులతో జల్సాలు చేసిన జగన్ సర్కార్ కు ఇక చుక్కలు కనిపిస్తాయని అంటున్నారు.

# శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయి

విజయవాడ, జూలై 23 ఏపీలో ప్రస్తుతం హత్యారాజకీయాలు హాట్ టాపిక్?గా మారాయి. జూన్ 4 నుంచి జులై 22 వరకు రాష్ట్రంలో రాజకీయ కారణాలతో ఎన్ని హత్యలు జరిగాయో కీలక సమాచారాన్ని పోలీస్ శాఖ వెల్లడించింది. ఏపీలో ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అటావిక పాలన మొదలైందని, కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆరోపించారు. దీనిపై ఎంపీ మిథున్ రెడ్డి కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. ఏపీలో ఇప్పటి వరకూ 31 రాజకీయ హత్యలు జరిగాయన్నారు. దీనిని పార్లమెంటులో ఎండగడతామని వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి తెలిపారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో వైసీపీ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని విమర్శించారు. ఏపీలో రాజకీయ కక్షలతో జరుగుతున్న దాడులను తాము పార్లమెంటులో ప్రస్తావిస్తామన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిని దేశం మొత్తానికి వివరిస్తామని రాజంపేట నియోజకవర్గం ఎంపీ మిథున్ రెడ్డి చెప్పారు. ఆయన వ్యాఖ్యలపై గణాంకాలతో సహా స్పందించింది పోలీస్ శాఖ. ఏపీలో 31 రాజకీయ హత్యలు జరిగాయన్న ఎంపీ మిథున్ రెడ్డి వ్యాఖ్యలను ఖండించింది.జూన్ 4 నుంచి జులై 22 వరకు రాష్ట్రంలో రాజకీయ కారణాలతో జరిగిన హత్యలు 4 అని కీలక విషయాలను వెల్లడించింది. అందులో అనంతపురం జిల్లాలో 2, గుంటూరు జిల్లాలో 1, కర్నూలు జిల్లాలో 1 ఘటన జరిగాయని వివరించింది. మృతి చెందినవారిలో ముగ్గురు టీడీపీకి చెందినవారని స్పష్టం చేసింది. ఒకరు వైసీపీకి చెందినవారని పోలీస్ శాఖ వివరించింది.

# జగన్ ఢిల్లీ టూర్ వెనక రాజకీయ కోణం

**జాతీయ స్థాయిలో నిలబడేందుకు యత్నం**

**ఊతకర్ర కోసం విపక్షాల వైపు చూపు**

అమరావతి,జూలై23(: ఇంతకాలం ఎపిలో అరాచకాలు జరిగినా పట్టించుకోని జగన్, ఇప్పుడు పల్నాడులో ఓ హత్యతో ఢిల్లీలో తన గళం వినిపించాలని బయలుదేరారు. అయితే ఇందులో ఆయన తన రాజకీయ భవిష్యత్‌ను కూడా వెతుక్కుంటున్నారని అర్థం అవుతోంది. ఉన్న 11 సీట్లతో ఎపిలో ఇప్పటి కిప్పుడు చేసేదేమీ లేదు. ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను అధిగమించడం కూడా ఇప్పట్లో కష్టమే ఈ క్రమంలో జాతీయ రాజకీయాల్లో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలుస్తోంది. అలాగే వైసీపీ అధినేత జగగన్ ఇప్పుడు జాతీయ స్థాయిలో తనకు అండగా నిలబడే ఓ పార్టీ కోసం చూసుకుంటున్నారు. ఇప్పటి వరకూ ఆయన కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి పూర్తి స్థాయిలో మద్దతు ప్రకటిస్తూ వచ్చారు. కానీ ఇప్పుడు బీజేపీ టీడీపీ, జనసేనలతో కలిసిపోవడంతో తనను ఇబ్బంది పెడుతుందని తెలుసు. వివిధ కేసుల విషయంలో టిడిపి వదలబోదు. వచ్చే కొద్ది రోజుల్లో జగన్ పై కేసుల విచారణ ఊపందుకోవడం.. వివేకా హత్య కేసులోనూ కీలక పరిణామాలు చోటు చేసుకుంటాయన్న అభిప్రాయం వినిపిస్తోంది. అలాగే తనపై కొత్త విచారణలు జరిగే అవకాశం ఉందని కూడా అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో జాతీయ పార్టీ అండ తనకు అవసరమని నమ్ముతున్నగా చెబుతున్నారు. ఇంతకాలం ఆయన బెయిల్‌పై ఉన్నారు. ఈ కేసుల్లో బెయిల్ ఉంటుందో కూడా తెలియదు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీకి దగ్గరయ్యేందుకు వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి గట్టి ప్రయత్నాలు చేస్తున్నారని ఢిల్లీ వర్గాల్లో విస్తృత ప్రచారం జరుగుతోంది. పార్లమెంట్ సమావేశాలకు ముందు రాజ్ నాథ్ సింగ్ ఆధ్వర్యంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో వైసీపీ ప్రత్యేకహోదా కావాలని అడిగిందని జైరాం రమేష్ ప్రచారం చేశారు. హోదా కోసం వైసీపీ ప్రయత్నిస్తోందని చెప్పేందుకు ప్రయత్నించారు. వైసీపీకి ఆయన పబ్లిసిటీ చేసి పెట్టారు. మరో వైపు గతంలో రాహుల్ గాంధీని, కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తూ రాజ్యసభలో ప్రసంగించే విజయసాయిరెడ్డి ఇప్పుడు పల్లెత్తు మాట అనడం లేదు. కాంగ్రెస్ పార్టీని విమర్శించడం లేదు.. ఏపీలో షర్మిలను కాంగ్రెస్‌తో కలపకుండా.. ఆమె చంద్రబాబుతో కుమ్మక్కయ్యారని ఆరోపిస్తున్నారు. ఇక్కడే అసలు రాజకీయం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది. జగన్ ఢిల్లీ పర్యటనకు ఎంచుకున్న అంశం జాతీయ రాజకీయాలకు సంబంధం లేనిది కానీ మోదీని కలుస్తానని జగన్ చెబుతున్నారు. కానీ తమ ఎన్డీఏ ప్రభుత్వం ఉన్న రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యపై కలుస్తానంటే మోదీ సమయం ఇవ్వడం కుదరదు. రాష్ట్రపతిని కలిసి ఫిర్యాదు ఇచ్చే అవకాశం ఉంది. జగన్ పై సీబీఐ కేసుల్లో విచారణలకు సమయం దగ్గర పడింది. వివేకా హత్య కేసులో సీబీఐ లోతుగా దర్యాప్తు చేస్తే.. ఆయన పేరు కూడా బయటకు వచ్చింది. తాజాగా ఇసుక, మద్యం స్కాముల్లో ఈడీ, సీబీఐ విచారణలకు రంగం సిద్ధమయిందని చెబుతున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో మొత్తం అవినీతిని బయట పెట్టి సీబీఐ, ఈడీకి రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసే అవకాశం ఉందని అంటున్నారు. ఈ కారణంగానే జగన్ తొందరపడుతున్నారని అంటున్నారు. ఢిల్లీలో కలసి వచ్చే పార్టీలని కలుపుకోవాలని జగన్ తన పార్టీ ఎంపీలకు చెప్పారు. జగన్ కు బీఆర్ఎస్ పార్టీ మద్దతు పలుకుతుంది. బీఆర్ఎస్ ను పక్కన పెడితే జాతీయ స్థాయిలో వైసీపీ దగ్గరకు వచ్చి మద్దతు పలికేవారు లేరు. జాతీయ రాజకీయాలకు జగన్ చాలా దూరంగా ఉంటూ వచ్చారు. ఈ కారణంగా ఆయనకు ఢిల్లీలో మిత్రులు లేరు. కానీ కలసి వచ్చే పార్టీల మద్దతు కోరుతామని అంటున్నారు. బహుశా ఇండియా కూటమిలోని పార్టీలే అని ఎక్కువమంది నమ్ముతున్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున ఎవరైనా ప్రతినిధి వచ్చి జగన్‌కు మద్దతు పలికే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. జగన్ కాంగ్రెస్ కు దగ్గర అయితే ఎక్కువగా నష్టపోయేది షర్మిలనే. అసలు ఏపీలో రాజకీయ హింస లేదని వారి పార్టీ నేతలే చంపుకున్నారని ఆమె తేల్చేశారు. జగన్ మోహన్ రెడ్డి ఢిల్లీలో చేయబోయే ధర్నాకు ఇండియా కూటమిపార్టీలు వచ్చి మద్దతిస్తే రాజకీయం సమూలంగా మారినట్లే అనుకోవచ్చు. బీజేపీకి ఆయన ఎదురెళ్లాలని డిసైడయ్యారని భావించవచ్చు. ఆ తర్వాతా ఆయన క్లిష్ట పరిస్థితుల్ని ఎదుర్కొనే అవకాశం ఉన్నా..తనకు సపోర్టుగా ఇతర పార్టీలు ఉంటాయని జగన్ ధైర్యంగా ఉన్నారని చెబుతున్నారు. మొత్తంగా జగన్ రాజకీయం ఇప్పుడు ఏదో వైపునకు మొగ్గాల్సిన పరిస్థితికి వచ్చిందని అనుకోవచ్చు. బిజెపితో కలవడానికి అవకాశం ఎలాగూ లేదు కనుక ..కొంత బలంగా ఉన్న విపక్ష కాంగ్రెస్‌తో కలవడం అనివార్యం కావచ్చు.



## త్వరగతిన గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి.

**హౌసింగ్ డిప్యూటీ ఎక్జుకూటివ్ ఇంజనీర్, నాగరాజు.**



దొర్నిపాడు, జూలై:23, శ్రీ ప్రస్థానం న్యూస్:- అసంపూర్తిగా ఉన్నా ఇళ్ళ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ డిప్యూటీ ఎక్జుకూటివ్ ఇంజనీర్ నాగరాజు, హౌసింగ్ సిబ్బందికి ఆదేశించారు.. మంగళ వారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం లో ఎంపీడీఓ. శ్రీ నివాసులు అధ్యక్షన హౌసింగ్ డి.ఈ.నాగరాజు, హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్ బ్రహ్మయ్య, మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని ఇంజనీరింగ్ అసిస్టెంట్,లకు హౌసింగ్,కు సంబందించి పలు అంశాలపై సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు, ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ దోర్నిపాడు మండలంలో 601 గృహాలు మంజూరు కాగా ఇప్పటి వరకు 410 గృహా నిర్మాణాలు పూర్తి చేశామన్నారు,191 గృహాలు వివిధ దశల్లో నిర్మాణాల్లో అసంపూర్తిగా ఉన్నాయని.. వాటినన్నిటిని కూడా లబ్ది దారులచే ఇళ్ళ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకొని సకాలములో బిల్లులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు.. ఈ కార్యక్రమంలో సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్,లు హౌసింగ్ సిబ్బంది, పాల్గొన్నారు..

## డాక్టర్లు అందుబాటులో ఉండాలి

**: జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా**

**యాళ్లూరు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ**





శ్రీ ప్రస్థానం - నంద్యాల, జులై 23:-సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి వైద్య సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం గోస్పాడు మండలం యాళ్లూరు గ్రామంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో డాక్టర్లు రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, టాయిలెట్లు, త్రాగునీరు తదితర సదుపాయాలపై పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్ లో రోజుకు ఎన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు, అత్యవసర సమయాలలో ఎవరెవరు పనిచేస్తున్నారు, ఏ సమయం నుండి వైద్య సర్వీసులు అందిస్తున్నారు, వైద్య పరికరాల కొరత ఏమైనా ఉందా తదితర అంశాలపై కలెక్టర్ వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చిన్నపిల్లల డాక్టర్ అవసరం ఉందని వైద్య సిబ్బంది కలెక్టర్ కు నివేదించారు. అలాగే 2020 సంవత్సరం నుండి ఆసుపత్రి భవనం నిర్మాణంలో వుందని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు. నిర్మాణంలోనున్న అసంపూర్తి ఆసుపత్రి భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వివరించారు.సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకుంటూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండటంతో పాటు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని కలెక్టర్ వైద్య సిబ్బందిని ఆదేశించారు.

## ఆరేళ్ల చిన్నారిపై అత్యాచార యత్నం

రాజేంద్రనగర్ ,శంషాబాద్ ఎయిర్పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణంచోటుచేసుకుంది. శంషాబాద్ మున్సిపాలిటి పరిధిలోని సిద్దాంతి వద్ద ఆరేళ్ల బాలికపై అత్యాచాయత్నం జరిగింది. బాలిక కుటుంబం వుంటున్న బిల్డింగ్ కింది పోర్షన్లో అద్దేకుంటున్న అంజనేయులు ఈ ఘాతుకానికి ఒడికట్టాడు. దేవరకద్ర మండలానికి చెందిన ఆంజనేయులు అతని కుటుంబంతో సిద్ధాంతిలో ఓ ఇంట్లో కింది పోర్షన్లో అద్దెకు ఉంటున్నాడు. సాయంత్రం స్నేహితులతో మద్యం తాగి ఇంటికివచ్చాడు. ఇతని భార్య ఓ పాస్ట్ పూడ్ లో పనిచెస్తుంది. సుమారు రాత్రి 8 గంటల సమయంలోఅమ్మవారి తొట్టెలు ఊరేగింపును చూసేందుకు బాధితురాలు రోడ్డుపైకి వచ్చింది.

# ఆదర్శ పాఠశాల సరిలేరు నీకెవ్వరు....

**మండల టాపర్ ఈ సారి ఆదర్శ పాఠశాల దే...**

**ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా రుద్రవరం ఆదర్శ పాఠశాలకు నాలుగు బస్సులు నియామకం....**

**ప్రిన్సిపల్ సంగెపు నాగేశ్వర రావు..**






నంద్యాల/రుద్రవరం-శ్రీ ప్రస్థానం:-మండల కేంద్రంలోని తువ్వ పల్లె సమీపంలో ఉన్నటువంటి ఆదర్శ పాఠశాల సరిలేరు నీకెవ్వరు, ఈసారి ఆదర్శ పాఠశాల దే మండల టాపర్ అని అలాగే ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఆదర్శ పాఠశాలకు ఆర్టీసీ డిపో వారు నాలుగు బస్సులు నియామకం చేశారని ప్రిన్సిపల్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రిన్సిపల్ మాట్లాడుతూ రుద్రవరం ఆదర్శ పాఠశాలకు నాల్గవ బస్సు సౌకర్యం కల్పించిన ఆర్టీసీ డిపో మేనేజర్ కు కృతజ్ఞతలు తెలుపుతూ, రుద్రవరం ఆదర్శ పాఠశాల మరియు కళాశాలలో ప్రిన్సిపల్ సంగెపు నాగేశ్వర రావు అను నేను 2021 లో జాయిన్ అయిన దగ్గర నుండి తన దైన శైలిలో అనేక మార్పులు, చేర్పులు చేస్తూ, ఉపాధ్యాయ బృందం తో తన ఆఫీసు సిబ్బంది అందరితో కలిసి మెలసి పని చేస్తూ, ప్రతి పని తన చొరవతో , అంకుటిత దీక్షతో చేస్తూ ముందుకు సాగుతున్నానన్నారు.ఒకప్పుడు ఈ ఆదర్శ పాఠశాలకు ఒక్క బస్ మాత్రమే అలా వచ్చి ఇలా వెళ్ళేది.కానీ ఇప్పుడు ఒక ప్రైవేట్ పాఠశాలలకు మాదిరిగా 4 బస్ లు రావడం ఎంతో ఆనందాన్నిస్తోందని అన్నారు. డిపో మేనేజర్ ఆర్. రాజేశేఖర్ రెడ్డి, ఎస్. టీ.ఐ శ్రీనివాసులు ను అడిగిన వెంటనే అమలు చేయడం చేలా ఆనందం కలిగిందన్నారు.కేవలం ఒక మారు మూల పల్లెటూరులో 600 మంది విధ్యార్థులు చదువుతూ ఉన్నారు.30 మంది స్టాఫ్ ,హాస్టల్ సిబ్బంది అలా అందరూ వస్తూ ఉన్నారు.ఇప్పుడు 4 వ బస్ కేటాయించడం ద్వారా పిల్లలకి మంచి మేలు చేకూరిందని ఆయన అన్నారు. అలాగే డిపో మేనేజర్ కి వారి సిబ్బందికి ప్రిన్సిపల్, పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు . ఈ కార్యక్రమం నందు వైస్ ప్రిన్సిపల్ సురేష్ కుమార్ మాట్లాడుతూ ఇది ఒక గొప్ప పరిణామం అని అన్నారు.

# అపార నష్టాన్ని మిగిల్చిన వానలు



ఏలూరు, జూలై 23 ఇటీవలి భారీ వర్షాలు, వరదలతో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా అతలాకుతలం అయ్యాయి. పంట మునకతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అలాగే తూర్పుగోదావరి ఏజెన్సీ ప్రాంతాల్లో చాలా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నిత్యం పచ్చగా ఉండే కోనసీమ ప్రాంతమంతా నీటి ముంపులో ఉంది;కాకినాడ ప్రాంతంలో తీర ప్రాంతంలో ప్రజలు సముద్ర కోతతో ప్రజలు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని భయంతో ఉన్నారు. రాజమండ్రి ప్రాంతంలోని కడియం వంటి ప్రాంతాల్లో రోడ్లన్ని వాగులను తలపిస్తున్నాయి. నర్సరీలు, ఉద్యాన పంటలు నీటిలోనే ఉన్నాయి. అలాగే వరి పొలాలన్నీ చెరువులను తలపిస్తున్నాయికోనసీమ ప్రాంతంలో పంటలు నీట మునిగాయి. పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఉంద్రాజవరం ఎర్ర కాలువ నీరు గట్లు తెంచుకోవడంతో వరి చేలు నీటితో ముంచెత్తాయి. కాట్రేనికోన మండలం కుండలేశ్వరం వద్ద పంట కాలువ వైపు కుంగిన ఏటి గట్టును కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ పరిశీలించారు. కోటిపల్లి రేవులో పడవ ప్రయాణాలు నిలిపివేశారు. నిడదవోలు, నల్లజర్లలో భారీ వర్షంలోనే తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పర్యవేక్షణ చేశారు. కాకినాడ జిల్లాలో సామర్లకోట మండలంలో పంట పొలాలన్నీ నీట మునిగాయి. ఏలేరు, తూర్పు డెల్టా పరిధిలో కాలువలు పొంగిపొర్లుతున్నాయి.తూర్పుగోదావరి జిల్లాలోని ధవళేశ్వరంలో 8.70 అడుగుల నీటిమట్టం నమోదు అయింది. దీనిలో 4.09 లక్షల క్యూసెక్కుల వరదనీటిని 175 గేట్ల ఎత్తి దిగువకు విడిచిపెట్టారు. ధవలేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక ఇచ్చారు. దీంతో కోనసీమ జిల్లాలో ఏడు గ్రామాలు ముంపుకు గురుకానున్నాయి. రాజమండ్రి పాత బ్రిడ్జి వద్ద 9 మీటర్లు నీటిమట్టం ఉంది. తూర్పు, పశ్చిమ, మధ్య డెల్టా కాలులకు 4,400 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. పోలవరం ఎగువ కాఫర్ డ్యాం వద్ద నీటి మట్టం 30.600 మీటర్లకు చేరింది. దీంతో దిగువకు 5.87 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడానికి సిద్ధపడ్డారు.అల్లూరి సీతారామ రాజు జిల్లాలోని రాజవొమ్మంగి, జీకే వీధి, ఎటపాక, మారేడుమిల్లు మండలాల్లో వాగులు ఉధ్ధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో చాలా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వీఆర్ పురం మండలంలో గోదావరి నదీ పరివాహక ప్రాంతాలైన తుమ్మలేరు పంచాయతీ, శ్రీరామగిరి పంచాయతీల్లో నాలుగు గ్రామాల చొప్పున ముంపులో ఉన్నాయి. వీరంత కొండలు, గుట్టలపైకి పరుగులుతీశారు. వీరి కనీసం అవసరాలు తీర్చే నాధుడు కూడా లేడు.చింతూరు మండలంలోని చీకటివాగు, సోకిలేరు, కొయ్యూరు వాగు, చంద్రవంక వాగులు ఉధ్ధృతంగా ప్రవాహించడంతో దాదాపు 70 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కొయగురు వాగు వరద దాటికి రహదారి కోతకు గురైంది. ఏలూరు జిల్లాలో దాదాపు 25 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 40 వేల ఎకరాల పంటకు నష్టం జరిగింది. అందులో 2,751 ఎకరాల్లో వరి నారు మడులు దెబ్బతిన్నాయి. 20 మండలాల్లో 263 గ్రామాల్లో పంట పొలాలు ముంపుకు గురయ్యాయి

# టీచర్ల అక్రమ బదిలీలు రద్దు

**ఉపాధ్యాయుల అక్రమ బదిలీల వ్యవహారంలో చంద్రబాబు ప్రభుత్వం కీలక నిర్ణయం**

అమరావతి, టీచర్ల అక్రమ బదిలీలు రద్దు917 మంది బదిలీల ఫైలును తిరస్కరిస్తూ సీఎం కీలక నిర్ణయంబొత్స హయాంలో అడ్డగోలు బదిలీలుపలు దఫాలుగా 2,400 మంది ట్రాన్స్ఫర్టీచర్ల నుంచి రూ. వంద కోట్లు వసూలు..ఎన్నికలకు ముందు చేసినవి ఇప్పుడు రద్దుఉపాధ్యాయుల అక్రమ బదిలీ ల వ్యవహారంలో చంద్రబాబు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికలకు ముందు బదిలీ ఆర్డర్లు పొందిన 917 మంది బదిలీలను రద్దు చేసింది. స్వయంగా సీఎం చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికలకు ముందు పలు దఫాలుగా అప్పటి ప్రభుత్వం భారీగా అక్రమ బదిలీలు చేసింది. వాటిలో 653 మంది బదిలీలను అప్పటి సీఎం ర్యాటిఫై చేశారు. 917 మందికి ఆర్డర్లు ఇచ్చినా ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాటిని ర్యాటిఫై చేయలేదు. దీంతో బదిలీ అయినప్పటికీ వారు పాత స్థానాల్లోనే కొనసాగుతున్నారు. ప్రభుత్వం మారిన వెంటనే ఆ ఆదేశాలను నిలుపుదల చేస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఆ తర్వాత తమను బదిలీ చేసినా రిలీవ్ చేయట్లేదంటూ 215 మంది టీచర్లు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరుగుతున్న సమయంలోనే పాఠశాల విద్యాశాఖ అప్పటి బదిలీలకు సంబంధించిన రాటిఫికేషన్ ఫైలును సీఎంకు పంపింది. దానిని పరిశీలించిన సీఎం చంద్రబాబు తిరస్కరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో 917 మంది బదిలీ ఉత్తర్వులు రద్దయి పోయాయి. గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఈ అక్రమ బదిలీలను ఒక వ్యాపారంగా మార్చేసింది. అడిగినంత ఇస్తే బదిలీ అన్నట్టుగా అడ్డగోలుగా వ్యవహరించింది.తద్వారా రూ. వంద కోట్ల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి.చేసింది చాలా.. ఆగింది కొన్నే సాధారణంగా ఉద్యోగ, ఉపాధ్యాయ బదిలీలపై ఎప్పుడూ నిషేధం ఉంటుంది. బదిలీలు చేయాలని నిర్ణయించినప్పుడు సీఎం ఆమోదంతో ఆ నిషేధాన్ని కొద్దిరోజులు సడలిస్తారు.సడలింపులు లేకుండా బదిలీలు చేయాలనుకుంటే ఆ ఫైలుకు సీఎం ఆమోదం తప్పనిసరి. అయితే, అప్పటి సీఎం జగన్ ఆదేశాలతోనే గత ప్రభుత్వంలో పెద్దఎత్తున అక్రమ బదిలీలు చేశారు. దాదాపు రెండేళ్ల వ్యవధిలో 2,400 బదిలీలకు ఆర్డర్లు జారీచేశారు. వీటికి 'సిఫారసు బదిలీలు' అనే పేరు పెట్టారు. అంతకుముందు ఏ ప్రభుత్వంలోనూ ఇంత భారీ సంఖ్యలో సిఫారసు బదిలీలు చేయలేదు. ఒక్కో టీచర్ నుంచి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలు వసూలు చేసి ఈ బదిలీలు చేసినట్టు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఎన్నికలకు చాలా కాలం ముందే ఈ తరహాలో బదిలీలు పూర్తిచేశారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో మరోసారి ఈ తరహా అక్రమ బదిలీలకు తెరదీశారు. వాటిలో 653 మంది బదిలీలకు అప్పటి సీఎం జగన్ ఆమోదముద్ర వేశారు. దీంతో వాటిని ఆపే పరిస్థితి లేకుండా పోయింది. కానీ సరిగ్గా ఎన్నికలకు ముందు మరో 917 మందికి బదిలీ ఉత్తర్వులు ఇచ్చేశారు. ఈలోపు ఎన్నికల కోడ్ రావడంతో ఆ బదిలీలను సీఎం రాటిఫై చేయలేదు. కోడ్ ఉన్నందున కొత్త స్థానాలకు వెళ్లొద్దని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. దీంతో అప్పు డు బ్రేక్ పడగా, ఇప్పుడు ఏకంగా రద్దయ్యాయి.విచారణకు డిమాండ్లు..టీచర్ల అక్రమ బదిలీలపై విచారణ చేయాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. అప్పటి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయన కార్యాలయం జోక్యం ఈ బదిలీల్లో ఎక్కువగా ఉంది. అలాగే కొందరు అధికారులు, రెండు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ప్రత్యక్షంగా ఇందులో భాగస్వామ్యం కావడంతో వారిపై చర్యలు తీసుకోవాలని టీచర్లు పట్టుబడుతున్నారు. రాష్ట్రంలో 1.7 లక్షల మంది టీచర్లు పనిచేస్తున్నారు. వారిలో ఎక్కువ మంది కౌన్సెలింగ్ విధానంలో నిబంధనల ప్రకారం బదిలీ అయ్యా రు. ఇలా కొద్ది మంది నగదు, రాజకీయ సిఫారసులతో దొడ్డిదారిన బదిలీ చేయించుకోవడాన్ని మిగిలిన టీచర్లు సహించలేకపోతున్నారు.

## ఘనంగా బండారు తనయుడు పుట్టినరోజు వేడుకలు





అనకాపల్లి జిల్లా పరవాడ మండలం శ్రీ ప్రస్థానం:-మాడుగుల ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తి తనయుడు బండారుతెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు జన్మదిన వేడుకలు ఆయన స్వగృహం నందు ఘనంగా నిర్వహించారు.పరవాడ గ్రామ నాయకులు ఆధ్వర్యంలో పరవాడ జూష్ట్రఇ లో రోగులకు పండ్లు రొట్టు పంపిణీ చేయడం జరిగింది పెందుర్తి నియోజకవర్గం పరవాడ సబ్బవరం వార్డు నాయకులు తన స్వగృహం కు వచ్చి శుభాకాంక్షలు తెలిపారుఅలాగే మాడుగుల నియోజకవర్గ నాయకులు కూడా బండారు జన్మదిన వేడుకలో పాల్గొన్నారు ఈ యొక్క కార్యక్రమంలో బండారు అభిమానులు నాయకులు కార్యకర్తలు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని బండారు అప్పలనాయుడు గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు

## జగన్ కు కాంగ్రెస్ మద్దతు...

విజయవాడ, జూలై 23, ఏపీకి ప్రత్యేక హోదా సాదించడంపై అధికార తెలుగుదేశం పార్టీకి చిత్తశుద్ధి ఉన్నట్టుగా కనిపించడం లేదని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యులు జైరాం రమేశ్ వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా జరిగిన అఖిల పక్ష పార్టీల సమావేశంలో బిహార్కు ప్రత్యేక హోదా లేదా ప్యాకేజీ కావాలని జేడీయూ, ఏపీకి ప్రత్యేక హోదా కావాలని వైఎస్సార్సీపీ డిమాండ్ చేస్తుంటే తెలుగుదేశం పార్టీ మాత్రం తనకేమీ సంబంధం లేదు అన్నట్టుగా సైలెంట్గా ఉందని జైరాం రమేశ్ ట్వీట్ చేశారు. ఏపీలో శాంతి భద్రతలు కరవయ్యాయని రాష్ట్రపతి పాలన విధించాలని అధికార టీడీపీ, ప్రతిపక్ష వైసీపీ పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తుండగా ఇప్పుడీ ట్వీట్ మరింత కాకేరేపుతోంది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఆదివారం రక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్ నేతృత్వంలో ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అన్ని పార్టీల నాయకులు హాజరయ్యారు. ఏపీ నుంచి టీడీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా ఉన్న శ్రీకృష్ణదేవరాయలు, వైసీపీ నుంచి ఎంపీ విజయసాయిరెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశంలో బీహార్ కు ప్రత్యేక హోదా కావాలని అధికార జేడీయూ, ప్రతిపక్ష ఆర్జేడీ ఎంపీలు డిమాండ్ చేశారన్నారు. లేదా ప్రత్యేక ప్యాకేజీ అయినా కావాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో ఏపీకి కూడా ప్రత్యేక హోదా డిమాండ్ ఎప్పటినుంచో ఉంది. దీనిపై అఖిలపక్ష సమావేశంలో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి డిమాండ్ చేయగా, టీడీపీ నుంచి మాత్రం ఎలాంటి డిమాండ్ వినిపించలేదని జైరాం రమేశ్ తన ట్వీట్లో ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో జేడీయూతోపాటు టీడీపీ కూడా ప్రభుత్వంలో కొనసాగుతున్నాయి. ఈ సమావేశంలో ప్రత్యేక హోదా పాటు ఏపీలో రాష్ట్రపతి పాలన విధించాలని ఎంపీ విజయసాయిరెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నుంచి హాజరైన జైరాం రమేశ్ మాత్రం నీట్ పరీక్షపై విచారణతోపాటు కాంగ్రెస్ పార్టీకి డిప్యూటీ స్పీకర్ పోస్టు కోసం డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఏపీలో రాష్ట్రపతి పాలన విధించాలని వైసీపీ అదినేత జగన్ ధర్నా చేయనున్న నేపథ్యంలో ఆ పార్టీని సపోర్టు చేసేలా కాంగ్రెస్ కీలక నాయకుడు ఎంపీ జైరాం రమేశ్ ట్వీట్ చేయడం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. మరోపక్క ఢిల్లీలో ధర్నా తర్వాత ఇతర పార్టీల నాయకులను ఎవరినైనా కలిసి జగన్ మద్దతు కోరుతారా అనేది ఆసక్తిగా ఉన్న తరుణంలో జైరాం రమేశ్ ట్వీట్ వెనుక కారణాలు ఏమై ఉంటాయని రాజకీయ వర్గాల్లో చర్చలు నడుస్తున్నాయి. ఇప్పటికే నేషనల్ మీడియా ఈ ట్వీట్ను హైలెట్ చేయడం విశేషం. జగన్ ఢిల్లీ ప్రణాళికపై విశ్లేషణలు నడుస్తున్నాయి. అయితే జగన్కు కాంగ్రెస్ మద్దతుగా నిలుస్తుందా లేదా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఏపీ ప్రత్యేక హోదా ఇస్తామని చెబుతోంది కాబట్టి జైరాం రమేశ్ ట్వీట్ చేశారా అనేది ప్రస్తుతానికి వేచి చూడాల్సిన అంశం.ఈ అంశంపై ఒక జాతీయ పత్రికతో మాట్లాడిన టీడీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ఈ రెండు అంశాలు మాత్రమే కాకుండా ఏపీ ఆర్థిక పరిస్థితితోపాటు చాలా అంశాలపై తాము పార్లమెంట్లో శ్వేతపత్రం విడుదల చేస్తామన్నారు.

## అక్రమ ఫామ్ హౌజ్ కూల్చివేత

రాజేంద్రనగర్,ఎమ్మార్పీఎస్ బ నేత నరేందర్, ప్రవీణ్ ను కిడ్నాప్ చేసి శంషాబాద్ దర్మగిరి గుట్ట లో బంధించిన ఫామ్ హౌస్ ను శంషాబాద్ మునిసిపల్ అధికారులు కూల్చివేసారు. ఫామ్ హౌజ్ కు అనుమతులు లేవని గుర్తించిన మునిసిపల్ అధికారులు ఫామ్ హౌస్ యాజమానికి నోటీసు జారీ చేసారు. ఫామ్ హౌజ్ లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని పోలీసులకు ఫిర్యాదులు వచ్చాయి.

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJITHA PRINTERS, H.NO: 46/801, BUDHAWARAPETA, KURNOOL DIST. - 518001, ANDHRA PRADESH, INDIA. PUBLISHED AT H.NO: 43/217A, N R PETA, KURNOOL DIST., ANDHRA PRADESH, INDIA. EDITOR : PERUMALLA CHENNAKESHAVULU.RNI No : APTEL 2020/80757